సోమవారం
21-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 61
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రక్తమోడిన పాకిస్తాన్

పాకిస్తాన్ రక్తమోడింది. రెండు వేర్వేరు ఘటనల్లో 31 మంది చనిపోయారు. ఆదివారం తెల్లవారుజామున తూర్పు పంజాబ్ ప్రావిన్స్ నుంచి హాఫీజాబాద్ జిల్లా వైపునకు వెళ్లే క్రమంలో ఫైసలాబాద్ టోల్ ప్లాజా వద్ద ఓ బస్సు మంటల్లో చిక్కుకొని 20 మంది సజీవ దహనం అయ్యారు.

2 లో

కాంగ్రెస్ కొత్త టీమ్

- 84 మందితో కార్యనిర్వాహక కమిటీ
- సీడబ్ల్యూసీ సభ్యులు 39 మంది
- జీ23 నాయకులకూ చోటు

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌కు కొత్త టీమ్ ఏర్పాటైంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం పార్టీ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ సీడబ్ల్యూసీని పునర్నిర్మించారు. 84 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ బృందంలో గతంలో పార్టీ నాయకత్వంపై విమర్శలు చేసిన శశి థరూర్, ఆనంద్ శర్మకు చోటు కల్పించారు. థరూర్‌ను ఓడించి ఖర్గే బాధ్యతలు స్వీకరించిన 10 నెలల తర్వాత ఏర్పాటు చేసిన అతి ముఖ్యమైన ఈ సీడబ్ల్యూసీలో 50 ఏళ్లలోపు యువ ముఖాలు, బలహీనవర్గాల నాయకులు, 15 మంది మహిళలు ఉన్నారు. కొత్త సీడబ్ల్యూసీ సభ్యులుగా 39 మంది ఉండగా, 32 మంది శాశ్వత ఆహ్వానితులు, కొందరు రాష్ట్ర ఇన్‌చార్జిలు, 13 మంది ప్రత్యేక ఆహ్వానితులు ఉన్నారు. యువజన కాంగ్రెస్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యూఐ), మహిళా కాంగ్రెస్, సేవాదళ్ అధ్యక్షులకు స్థానం కల్పించారు. అప్పటి కాంగ్రెస్

- మిగతా 2 లో

తెలుగు రాష్ట్రాల నుంచి వీరే...

కాగా, తెలుగు రాష్ట్రాల నుంచి సీడబ్ల్యూసీ సాధారణ సభ్యుల జాబితాలో ఆంధ్ర ప్రదేశ్ నుంచి మాజీ మంత్రి రఘువీరా రెడ్డి ఉండగా, శాశ్వత ఆహ్వానితులుగా టీ.సుబ్బరామిరెడ్డి, కె.రాజు, దామోదర రాజనర్సింహకు అవకాశం దక్కింది. అలాగే ప్రత్యేక ఆహ్వానితులుగా పల్లంరాజు, వంశీచంద్ రెడ్డిని ఎంపిక చేశారు.

అడుగు దూరంలో...

- చంద్రుడిపై దిగబోతున్న చంద్రయాన్-3
- చివరి కక్ష్య తగ్గింపు, వేగం నియంత్రణ పూర్తి
- సాఫ్ట్ ల్యాండింగ్‌పై ఇస్రో ఆశలు



బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 తన గమ్యానికి అడుగు దూరంలో ఉంది.

బుధవారం చంద్రుడిపై దిగేందుకు వ్యోమనౌక సిద్ధమైంది. చివరిసారిగా కక్ష్య తగ్గింపు, గతి నియంత్రణ ప్రక్రియలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ మేరకు ఇస్రో ఆదివారం సామాజిక మాధ్యమాల్లో పేర్కొంది. సాఫ్ట్ ల్యాండింగ్ కోసం అంతర్గత పరీక్షలు ల్యాండర్ మాడ్యూల్‌కు అవసరమని తెలిపింది. 'ల్యాండర్ మాడ్యూల్ (ఎల్‌ఎం)లో ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రజ్ఞాన్

- మిగతా 2 లో

రష్యా లూనార్ మిషన్ విఫలం

చంద్రుడిని ఢీకొని కూలిపోయిన లూనా-25

2 లో

రాజ్యాంగంపై కపట ప్రేమ

- దీనిని మార్చాల్సిన అవసరం ఉంది
- పద్మశ్రీ సయీదా హమీద్
- ఉత్సాహపూరితంగా ప్రారంభమైన అరసం జాతీయ మహాసభలు

జబల్పూర్ నుంచి వేల్పుల నారాయణ

రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నట్లు చాలామంది నటిస్తున్నారని, కానీ నిజంగా వారు ప్రేమించడం లేదని, ఈ కపట ప్రేమను మార్చాల్సిన అవసరం అందరిపై ఉందని ప్రముఖ సాహితీవేత్త, పద్మశ్రీ డా.సయీదా హమీద్ అన్నారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ప్రారంభమైన అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం 18వ మహాసభల్లో ఆమె ప్రారంభోపన్యాసం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో లౌకిక ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని డా.హమీద్ హెచ్చరించారు. 2024 కత్తి మన మెడలపై వేళాడుతోందని హెచ్చరించారు. ఇప్పుడు ప్రగతిశీల రచయితలు నిర్వహించిన పెద్ద ఊరేగింపు చీకటిలో కిరణమని, ఒక కొత్త వెలుగని, మీరందరు యువకులని, దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడడానికి మీ వెనుక మేమున్నామని ఆమె ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. తన ఇంటినుండే అభ్యుదయ రచయితల సంఘంతో సంబంధం ఉందని, ఆ అనుబంధం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. అభ్యుదయ రచయితలు సమాజ మార్పు కోసం తమ సాహిత్యాన్ని ఏ విధంగా నిబద్ధతతో రాశారో సోదాహరణంగా ఆమె వివరించారు.

ఇక ఇంధనం వంతు

- పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకంలో కోతల్లేవ్ 2 లో
- తగ్గనున్న కూరగాయల ధరలు

దేశంలో కొంతకాలంగా ద్రవ్యోల్బణం తారస్థాయికి చేరుకుంది. నిత్యావసరాలు, కూరగాయలు, పప్పు, బియ్యం ధరలు భారీగా పెరిగాయి. ఇటీవల టమాటా కిలో రూ.200 పలికింది. ఆ తర్వాత ఆపిల్, బియ్యం, ఉల్లి వంటివి ధర పెరుగుతున్నాయి. ఇక ఇంధనం కూడా మరింత ప్రియం కాబోతోందన్న అంచనాలు ఉన్నాయి.

బీజేపీ రాజకీయ అస్త్రం జీ20

- మెజారిటీ ఓట్ల కోసమే మణిపూర్‌లో హింస
- ఏపీ, తెలంగాణలను మోసం చేస్తున్న బీజేపీ
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ: సెప్టెంబరులో దిల్లీలో నిర్వహించనున్న జీ20 సదస్సును తన రాజకీయ అస్త్రంగా వాడుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. జీ 20 సదస్సు కోసం ఇప్పటి నుంచే నాకా బందీ అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. దిల్లీలో పోలీసుల ఆంక్షలు, తనిఖీలతో ఇప్పటి నుంచే ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ దిల్లీలో కొన్ని కార్యాలయాలను మూసివేయించారని, మోదీ చైర్మన్ కావడంతో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని వ్యాఖ్యానించారు. జీ20 లోగోగా పుష్పం పెట్టి రాజకీయంగా వాడుతున్నారన్నారు. రాజకీయ దిగుజారుడుతనానికి ఇదే నిదర్శనమన్నారు. మణిపూర్ మండిపోతున్నా కేంద్రం చోద్యం చూస్తున్నదని, గుజరాత్ తరహా కుట్రలు మణిపూర్‌లో అమలు చేస్తూ అప్పటి కంటే అరాచకాలు సృష్టిస్తున్నదని మండిపడ్డారు. మణిపూర్‌లో జరిగేది కులాల మధ్య కొట్లాటకాదన్నారు. మణిపూర్‌లో విద్వేషాలు రెచ్చ గొట్టింది బీజేపీయేనని, అక్కడ అల్లర్లకు, అరాచకాలకు బీజేపీయే కారణమని స్పష్టంచేశారు. హైకోర్టు ద్వారా అక్కడ ప్రభుత్వానికి ఆదేశాలు ఇప్పించారన్నారు. గిరిజనుల రక్షణకు చట్టం ఎప్పటి నుంచో ఉందని, ఆ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్రలో భాగంగానే అక్కడ దాడులు జరుగుతున్నాయని నారాయణ విమర్శించారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ అల్లర్లు ఎందుకు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. విలువైన అటవీ సంపద, ఖనిజ నిక్షేపాలను కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టాలనేదే మోదీ ఉద్దేశమన్నారు. ఇప్పటికే 54వేల ఎకరాల భూమిని అదానీకి కట్టబెట్టారని విమర్శించారు. జాతుల మధ్య అల్లర్లు సృష్టించి గిరిజన ప్రాంతాన్ని వేరుచేసి కేంద్రం తన గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్నదన్నారు. మణిపూర్‌లో పోలీసుల ఎదుటే మారణహోమం జరిగిందని, తల్లి, కుమార్తెలపై అత్యాచారం చేసి చంపేశారని చెప్పారు. పార్లమెంటు రేపు జరుగుతుండగా వీడియో బయటకి వచ్చిందని, మే 3న ఘటన జరిగితే ఇప్పుడు వీడియో ఇచ్చారంటేనే మోదీ కుట్ర అర్థమవుతోందన్నారు. అంతకముందు అమిత్ షా అక్కడ పర్యటించిన

- మిగతా 2 లో

నేడు మణిపూర్‌కు సీపీఐ బృందం

శాంతి నెలకొల్పడమే ఉద్దేశం...

న్యూఢిల్లీ: హింస పీడిత మణిపూర్‌లో శాంతి నెలకొల్పడమే ఉద్దేశంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా నేతృత్వ బృందం ఈనెల 21-24 తేదీల్లో ఆ రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన వెలువరించింది. మణిపూర్ ఐక్యతకు సీపీఐ నాయకుడు, జననేత హిజం ఇరాబట్ తోడ్పాటు అసాధారణమని కొనియాడింది. ప్రతినిధులు 21న ఇంఫాల్‌కు చేరుకుంటారని ప్రకటన తెలిపింది. మూడు నెలలుగా రగులుతున్న మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు సీపీఐ తన వంతు కృషి చేస్తోంది. రాష్ట్రంలోని హింస పీడిత ప్రాంతాల్లో పర్యటించి, పునరావాస కేంద్రాలను సందర్శించి, బాధితుల్ని పరామర్శించి, లోయ, గిరి ప్రాంతాల్లో కలియతిరిగి, ప్రజలతో మాట్లాడి ప్రస్తుత సంక్షోభానికి పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రయత్నిస్తుంది. అలాగే మణిపూర్ గవర్నర్ అనసూయ ఉయికెను కలిసి క్షేత్రస్థాయి పరిస్థితులను ఆమెకు వివరించాలని కూడా ప్రతినిధులు భావిస్తున్నారు. ఇదే క్రమంలో 23న పార్టీ 75వ వ్యవస్థాపన దినోత్సవ సభలోనూ వారు పాల్గొంటారు. ప్రతినిధుల బృందంలో సీపీఐ కార్యదర్శులు కె.నారాయణ, వినయ్ విశ్వం, రామకృష్ణ పాండా, అసోంకు చెందిన సీనియర్ నాయకురాలు అసోమీ గొగోయ్ ఉన్నారు.

ఇదీ లోకం!

సర్కారు వారి పాట!

- వైద్య సీట్లకు భారీ ఫీజులు
- ఐదు కొత్త వైద్య కళాశాలలకూ వర్తింపు
- బీ, సీ కేటగిరీల దుమారం
- ప్రైవేటుకు దీటుగా దోపిడీ
- రిజర్వుడు సీట్లు ఉఫ్
- ఐదేళ్లలో సీ-కేటగిరికి రూ.కోటి
- బీ-కేటగిరి రూ.60 లక్షలు
- పేద విద్యార్థులకు ప్రభుత్వ ఉత్తర్వుల శాపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కొత్తగా ప్రారంభం కానున్న ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫీజుల మోత మోగనుంది. వైద్య విద్య రంగానికి పెద్దపీట వేస్తామంటూ జగన్ సర్కారు హామీలకు, ఆచరణలో వాటి అమలుకు పొంతన లేకుండా పోతోంది. ఈ విద్యా సంవత్సరం (2023-24) నుంచి ఎంబీబీఎస్ సీట్లలో బీ, సీ అనే కేటగిరీల కింద 50 శాతం సీట్ల భర్తీకి ప్రభుత్వ జారీ చేసిన ఉత్తర్వులపై సర్వత్రా వ్యతిరేకత నెలకొంది. దీనివల్ల రిజర్వుడు సీట్లు కుదించుకుపోనున్నాయి. ప్రభుత్వ వైద్య విద్య సీట్లతో సరికొత్త వ్యాపారానికి సర్కార్ తెరదీసిందని, ఇది పేద విద్యార్థుల పాలిట శాపంగా మారిందనే విమర్శలున్నాయి. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ విద్యార్థి, యువజన

- మిగతా 2 లో

అవినీతికి నిలయం హోంశాఖ

- తర్వాత స్థానాల్లో రైల్వే, బ్యాంకు అధికారులు
- కేంద్ర విజిలెన్స్ కమిషన్

న్యూఢిల్లీ: గత ఏడాది అత్యధిక అవినీతి ఫిర్యాదులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై, రైల్వేలు, బ్యాంకుల్లో పని చేస్తున్న వారిపైనే నమోదయ్యాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ తాజా వార్షిక నివేదిక పేర్కొంది. మొత్తంగా, 2022లో కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలలో అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులపై 1,15,203 ఫిర్యాదులు అందాయని తెలిపింది. వీటిలో నివేదిక ప్రకారం, 85,437 పరిష్కారం కాగా, 29,766లో 22,034 మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఫిర్యాదులను పరిశీలించడానికి

- మిగతా 2 లో

పేదలకు మోదీ చేసిందేమీ లేదు

- గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- చింతపల్లిలో కదంతొక్కిన ఎర్రదండు

8 లో

తొమ్మిదేళ్ల నరేంద్ర మోదీ పాలనలో పేద ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదని, అంబానీ, అదానీలు ప్రపంచంలోనే అత్యంత ధనిక వ్యక్తులుగా ఎదిగారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు.

రక్తమోడిన పాకిస్తాన్

- రెండు ఘటనల్లో 31 మంది మృతి
- బస్సు ప్రమాదంలో 20 మంది సజీవదహనం
- ఉగ్ర దాడిలో 11 మంది కూలీల దుర్మరణం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ రక్తమోడింది. రెండు వేర్వేరు ఘటనల్లో 31 మంది చనిపోయారు. ఆదివారం తెల్లవారుజామున తూర్పు పంజాబ్ ప్రావిన్స్ నుంచి హఫీజాబాద్ జిల్లా వైపునకు వెళ్లే క్రమంలో ఫైసలాబాద్ టోల్ ప్లాజా వద్ద ఓ బస్సు మంటల్లో చిక్కుకొని 20 మంది సజీవ దహనం అయ్యారు. ఖైబర్ పంఖ్‌తుంఖ్వా ప్రావిన్స్‌లో ఉగ్రదాడి జరిగింది. పేలుడులో 11 మంది కూలీలు ప్రాణాలు కోల్పోయారు. కాగా, బస్సు ప్రమాదంలో 15 మంది తీవ్రమైన కాలిన గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు చెప్పారు. అటుగా వెళ్లే ఇంధన రవాణా వ్యాన్‌ను బస్సు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని, వెంటనే బస్సులో నుంచి బయటకు దూకిన వాళ్లు ప్రాణాలతో, స్వల్పగాయాలతో బటయపడ్డారని ఐజీ మోటార్వే పోలీస్ సుల్తాన్ ఖ్వాజా చెప్పారు. మంటలు కమ్మేయడంలో మిగతా ప్రయాణికులకు తప్పించుకునే అవకాశం లభించలేదని అన్నారు. బస్సు డ్రైవర్ నిద్రపోవడం వల్ల ఈ ఘటన చోటుచేసుకుందా లేక ఇంకేమైన కారణాలు ఉన్నాయా అన్నది దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ఇంధన ట్యాంకును వ్యాన్ తరలిస్తుండటం వల్లనే మంటలు వ్యాపించినట్లు చెప్పారు. డీఎన్ఏ పరీక్షలు నిర్వహించడం ద్వారా మృతులను గుర్తించి వారి కుటుంబాలకు మృతదేహాలను అప్పగించనున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై పంజాబ్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రి మొహసీన్ నఖ్వీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. గాయపడిన వారిని మెరుగైన వైద్య సదుపాయం అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో మొత్తం 40 మంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలావుంటే, ఖైబర్ పంఖ్‌తుంఖ్వా ప్రావిన్స్‌లో ఉగ్రదాడి జరిగింది. పేలుడులో 11 మంది కూలీలు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుంటే, పాకిస్తాన్ జరిగిన ఉగ్రదాడిలో 11 మంది అమాయకపు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. అత్యాధునిక పేలుడు పరికరాన్ని పేలుడు కోసం వినియోగించినట్లు పోలీసు, భద్రతా అధికారులు తెలిపారు. అఫ్గాన్ సరిహద్దు వద్ద వజిరిస్తాన్‌లో నిర్మాణ పనుల కోసం కార్మికులను తరలిస్తున్న ట్రక్కును ఉగ్రవాదులు పేల్చివేసినట్లు చెప్పారు. మృతులు ఆర్మీ పోస్టు నిర్మాణ కూలీలని అన్నారు. ఐఈడీని వాహనం కింద అమర్చినట్లు వజిరిస్తాన్ డిప్యూటీ కమిషనర్ రెహాన్ ఖటక్ తెలిపారు. ఇప్పటివరకు ఏ ఉగ్రసంస్థ ఈ ఘటనకు బాధ్యత తీసుకోలేదన్నారు. ప్రధాని దిగ్భ్రాంతి: పాకిస్తాన్ అపద్ధర్మ ప్రధాని అన్వర్ ఉల్ హక్ కాకర్ తాజా ఘటనపై ఎక్స్ మాధ్యమంగా దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అమాయక కూలీలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. అమాయకుల ప్రాణాలను తీసి అర్థంలేని హింసను ఖండిస్తున్నట్లు తెలిపారు.

బ్రిక్స్ సదస్సుకు ఇండోనేసియా అధ్యక్షుడు

ఆపై కెన్యా, తాంజానియా, మొజాంబిక్‌లో పర్యటన

జకార్త: దక్షిణాఫ్రికాలోని జొహనస్‌బర్గ్‌లో జరగబోయే బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విల్డోడో హాజరుకాబోతున్నారు. ఇందుకోసం ఆయన ఆదివారం దక్షిణాఫ్రికాకు బయల్దేరి వెళ్లినట్లు ఇండోనేసియా వర్గాలు తెలిపాయి. బ్రిక్స్ భాగస్వామ్యాన్ని ఇండోనేసియా ఆకాంక్షిస్తున్నట్లు ఊహాగానాలు ఉండటంతో విల్డోడో ఆఫ్రికా పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

ప్రస్తుతానికి బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాలుగా బ్రిక్స్ కూటమిలో ఉన్నాయి. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు బ్రిక్స్ సదస్సు జరగనుంది. ఇందుకు అనేక దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. భారత్, చైనా, రష్యా దేశాధినేతలు ఒకే వేదికను పంచుకోనుండటంతో పాటు అనేక దేశాలు బ్రిక్స్ సభ్యత్వాన్ని కోరుకుంటుండటంతో ఈ సదస్సుకు ప్రాధాన్యత పెరిగింది. బ్రిక్స్ సదస్సుకు రావాలని ఇండోనేసియాకు ఆహ్వానం అందినందునే వెళుతున్నట్లు తన ప్రయాణానికి ముందు విలేకరులతో విల్డోడో అన్నారు. దక్షిణాఫ్రికాలో విల్డోడో పర్యటించడం ఇదే మొదటిసారి. సదస్సు అనంతరం ఆయన కెన్యా, తాంజానియా, మొజాంబిక్ దేశాల్లోనూ పర్యటిస్తారు.

ఆ దేశాలతో సహకార సంబంధాలను బలోపేతం చేసుకోవడమే అధ్యక్షుడి పర్యటన ఉద్దేశమని అధికార వర్గాలు తెలిపాయి. తాంజానియా, కెన్యా దేశాలు గతేడాది తమ దౌత్య కార్యాలయాలను జకార్తలో ప్రారంభించాయి. ఇండోనేసియాతో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్న తొలి ఆఫ్రికా దేశంగా మొంజాబిక్ నిలిచింది.

ఇథియోపియాలో ఆకలి కేకలు

12 లక్షల పిల్లల్లో తీవ్ర పౌష్టికాహార లోపం : ఐరాస

అడిడిస్ అబాబా: ఇథియోపియాలో ఆహార సంక్షోభం ముదిరింది. ఘర్షణాత్మక వాతావరణం కారణంగా అభద్రతా భావం పెరిగిందని, 12 లక్షల మంది పిల్లలు తీవ్రమైన పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని ఐక్యరాజ్య సమితి (ఐరాస్) వెల్లడించింది. ఇథియోపియాలోని పీడితులకు మానవతా సహాయాన్ని అందజేస్తున్నట్లు ఐరాస ప్రతినిధి స్టెఫినే దుజారిక్ తెలిపారు. తూర్పుఆఫ్రికా దేశవ్యాప్తంగా ఆహార సంక్షోభం, వ్యాధుల పీడితులు ఉన్నారని చెప్పారు. ఈ పరిస్థితుల నివారణకు శ్రమిస్తున్నట్లు తెలిపారు. 2020లో ఫెడరల్ ప్రభుత్వానికి, టిగ్రే పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ (టీపీఎల్ఎఫ్) దళాలకు మధ్య భీకర పోరు మొదలైనప్పటి నుంచి అభద్రతా భావం, ఆహార సంక్షోభం తీవ్రస్థాయికి చేరినట్లు చెప్పారు. ఆఫ్రికా యూనియన్ చొరవతో గత నవంబరులో యుద్ధానికి ముగింపు పలికి శాంతి ఒప్పందంపై రెండు వర్గాలు సంతకాలు చేసినప్పటికీ ప్రజల స్థితిగతుల్లో పెద్దగా మార్పు లేదన్నారు. పీడితులకు మానవతా సాయం అందుతోందని, మందులు, లాజిస్టిక్స్ సహకారం అందిస్తున్నట్లు దుజారిక్ తెలిపారు. కలరా నివారణ కోసం ఓరోమియా, సిదామా, సోమాలియా ప్రాంతాల్లో ముమ్మర కసరత్తులు సాగుతున్నాయని చెప్పారు. కలరా కేసులు 16,800కు చేరుకోగా, మలేరియా కూడా ప్రాణాంతకంగా మారిందని, 200 మంది బలికాగా 17లక్షల మంది ఈ వ్యాధి బారిన పడ్డారని ఆమె తెలిపారు. పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు 30కుపైగా ఐరాస సంస్థలు, అంతర్జాతీయ, దేశీయ ఎన్జీవోలు తీవ్రస్థాయిలో శ్రమిస్తున్నాయని చెప్పారు. అఫర్, అంహారా, ఓరోమియా, సిదామా, టిగ్రే ప్రాంతాల్లో పరిస్థితులు దయనీయంగా ఉన్నట్లు తెలిపారు.

రష్యా లూనార్ మిషన్ విఫలం

మాస్కో: రష్యా దాదాపు 50ఏళ్లలో మొదటిసారి చేపట్టిన లూనార్ మిషన్ తుది దశలో విఫలమైంది. లూనా-25 చంద్రుడి దగ్గరకు చేరుకుందికానీ దానిపై సజావుగా దిగలేకపోయింది. ప్రీలాండింగ్ ప్రక్రియ క్రమంలో చంద్రుడి ఉపరితలాన్ని బలంగా ఢీకొని కూలిపోయిందని రష్యా అంతరిక్ష పరిశోధన కేంద్రం రాస్‌కాస్మోస్ ఆదివారం ఓ ప్రకటన చేసింది. శనివారం స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.57 గంటలతో లూనా-25తో సంప్రదింపులు తెగిపోయినట్లు రాస్‌కాస్మోస్ వెల్లడించింది. లూనా-25ను గుర్తించేందుకు శని, ఆదివారాలు విఫలప్రయత్నాలు చేసినట్లు తెలిపింది. లూనా-25 కూలిపోవడానికిగల కారణాలను ఆరా తీస్తామని చెప్పింది. అయితే ఎటువంటి సాంకేతిక సమస్య తలెత్తినదో వెల్లడించలేదు. 800కిలోల లూనా-25 ఒకవేళ చంద్రిని దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసివుంటే రష్యా చరిత్ర సృష్టించేంది. కానీ సోవియట్ వారస్వాతాన్ని నిలబెట్టాలన్న రష్యా కలలు సాకారం కాలేకపోయాయి. ఈ తాజా పరిణామంతో భారత్ ప్రయోగించిన చంద్రయాన్-3 అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ వ్యోమనౌక 23వ తేదీన చంద్రుడిపై దిగాల్సి ఉంది.

బీజేపీ రాజకీయ అస్త్రం జీ20

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో ఎందుకు వీడియో ఇవ్వలేదని ప్రశ్నించారు. పార్లమెంటులో రచ్చ చేయించి తమ బిల్లులు పాస్ చేసుకోవాలనే ఈ వీడియో విడుదల చేశారని, మణిపూర్‌లో టెర్రరిస్టు గ్రూపులతో మోదీకి రహస్య ఒప్పందం ఉందని ఆరోపించారు. టెర్రరిస్టు గ్రూపుల నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో శాంతి నెలకొల్పేందుకు రెండుపక్షాలతో చర్చలు జరపాలని సూచించారు. రాష్ట్రంలో గిరిజనుల హక్కులు కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మణిపూర్ ఘటనను అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని మోదీ, అమిత్ షా ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీకి ఎవరు మద్దతిచ్చినా మణిపూర్ దాడులను సమర్థించినట్లే తాము భావిస్తామన్నారు. అక్టోబర్‌లో విపక్ష కూటమి సమావేశమవుతుందన్నారు.

తెలుగు రాష్ట్రాలకు ప్రధాన శత్రువు బీజేపీ

విభజన చట్టం అమలు చేయకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను బీజేపీ మోసం చేస్తున్నదని, తెలుగు రాష్ట్రాలకు ప్రధాన శత్రువు బీజేపీయేనని నారాయణ ఆరోపించారు.

ఏపీలో వైసీపీ ప్రభుత్వం మోదీ కనుసన్నల్లో పని చేస్తున్నదన్నారు. కేంద్రం ఎటువంటి బిల్లు పెట్టినా జగన్ సమర్థిస్తున్నారని చెప్పారు. బీజేపీ, వైసీపీకి సంబంధించి పేరు మాత్రమే మార్పు అని, రెండు పార్టీలూ ఒక్కటేనని చెప్పారు. మోదీకి అనుకూలంగా ఉన్నందునే జగన్‌పై చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సుదీర్ఘ కాలం బెయిల్‌పై బయట ఉన్న వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. ఆర్థిక నేరాలు చేసినట్లు ఆధారాలు ఉన్నా జైలుకు వెళ్లకుండా బయటే ఉన్నాడని, సీబీఐ కూడా ఏమీ చేయలేని నిస్సహాయతలో ఉందన్నారు. సీఎం జగన్ నియంత పాలనకు నిదర్శనమన్నారు. అనుకూలంగా ఉంటే ఒకవిధంగా, వ్యతిరేకంగా ఉంటే మరో విధంగా జగన్ తీరు ఉందన్నారు. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు బీజేపీతోనే ఉన్నాయని చెప్పారు. ఏపీలో టీడీపీ, జనసేన కూడా బీజేపీతోనే ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి కావాలనే అజెండాతో వాళ్ల యాత్రలు చేస్తున్నారని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ బస్సుయాత్ర చేపట్టిందన్నారు. ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన రాజధాని అమరావతి ఆగిపోయిందని, మోదీకి సిగ్గు ఉంటే జగన్‌మోహన్ రెడ్డిని దీనిపై నిలదీయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి మంచి నాయకురాలే అయినా కాషాయపార్టీ గుప్పెట్లో ఉండటంతో ఏమీ చేయలేకపోతున్నారని చెప్పారు.

బీజేపీ కేంద్ర పెద్దలు జగన్‌తో కలిసి ఉంటారు... పవన్‌తో పొత్తు అంటారని, దీనివల్ల ఏపీలో బీజేపీకి సొంతగా ఏమీ ఉండదన్నారు. మతోన్మాద బీజేపీకి ఎవరు మద్దతిచ్చినా వారు తమకు రాజకీయ ప్రత్యర్థులేనని నారాయణ స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి చేపట్టిన బస్సుయాత్రకి మంచి స్పందన వస్తున్నదన్నారు. తిరుపతిలో జరిగే బస్సుయాత్ర ముగింపు సభలో పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి వినయ్ విశ్వంతో పాటు తాను పాల్గొంటానని వివరించారు. సమావేశంలో ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్.కోటేశ్వరరావు, దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

అడుగు దూరంలో...

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. ఇవి మూడు రోజుల్లో చంద్రుడి ఉపరితలంపై అడుగు పెట్టబోతున్నాయి. 23వ తేదీన సాయంత్రం 5.04 గంటలకు చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 దిగుతుంద'ని ఇస్రో పేర్కొంది. తొలుత 23వ తేదీ సాయంత్రం 5.47 గంటలకు ల్యాండింగ్ జరుగుతుందని అంచనా వేసింది. కానీ ఆ సమయం 17 నిమిషాల మేర తగ్గింది. తుదిదశ డీబూస్టింగ్ (వేగం తగ్గించే ప్రక్రియ) పూర్తి కాగా ఎల్ఎం కక్ష్య 25కిమీ×134కిమీలుగా ఉన్నట్లు ఇస్రో తెలిపింది. రష్యా 50 ఏళ్ల తర్వాత చేపట్టిన లూనాన్ మిషన్ విఫలం కావడంతో చంద్రయాన్-3పై అంచనాలు పెరిగాయి. అంతా అనుకున్నట్లు జరిగితే భారత్ కొత్త రికార్డు సొంతం చేసుకోనుంది. తద్వార భారతీయ శాస్త్రీయ, సాంకేతిక, పారిశ్రామిక రంగంలో ప్రగతిపథంలో మరో ముందడుగు పడుతుంది. చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ చరిత్రాత్మకమని, దీనిని ప్రత్యక్షంగా వీక్షించేందుకు దేశంలోని అన్ని స్కూళ్లు, విద్యాసంస్థలను ఇస్రో ఆహ్వానించింది. జులై 14న చంద్రయాన్-3ని ప్రయోగించగా, 35రోజుల తర్వాత ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ విడిపోయింది. ఆగస్టు 5, 6, 9, 14, 16, 17 తేదీల్లో కీలక దశలను విజయవంతంగా పూర్తి చేసుకొని 23వ తేదీన చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని తాకి చరిత్ర సృష్టించేందుకు చంద్రయాన్-3 సిద్ధంగా ఉంది.

సర్కారు వారి పాట!

(మొదటిపేజీ తరువాయి)

సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగాయి. విజయవాడ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ముట్టడికి దిగారు. ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఉధృత ఆందోళనకు దిగుతామని వైద్య విద్యార్థులు హెచ్చరించినా జగన్ సర్కారు మొండిగా ముందుకు పోతోంది. ప్రభుత్వం ఏదైనా ఉత్తర్వులను విడుదల చేసే ముందు ప్రజల నుంచి అభిప్రాయం తీసుకోవాల్సి ఉంది. ఎవరి దగ్గర నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టకుండా, ఇలా ఇష్టానుసారంగా కేటగిరీల వారీగా భారీ ఫీజులు విధించడాన్ని విద్యార్థులు తప్పుపడుతున్నారు. ప్రైవేట్‌లో పెద్ద ఎత్తున ఫీజులను దండుకుంటున్నారు. దానికితోడుగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనూ కేటగిరీల వారిగా ఫీజులను విభజించడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పేద వర్గాలకు చెందిన ప్రతిభ గల విద్యార్థులకు వైద్య విద్యా సీట్లు దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రైవేట్ వైద్య కళాశాలల్లోని బీ, సీ కేటగిరీ సీట్లను కౌన్సెలింగ్ ద్వారా దక్కించుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆ భారీ ఫీజులు కట్టలేక వారంతా వెనక్కి తగ్గుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో రూ.15 వేల నుంచి రూ.20 వేల మధ్యే అన్ని సీట్లు భర్తీ చేయగా, ఏపీలో మాత్రం అందుకు విరుద్ధంగా జగన్ సర్కారు వ్యవహరిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పేద విద్యార్థులు అంత పెద్ద మొత్తంలో వెచ్చించి సీట్లను కొనుగోలు చేయలేరు. ఈ విద్యా సంవత్సరం రాష్ట్రం నుంచి 68,678 మంది నీట్ పరీక్షలకు హాజరు కాగా, అందులో 48,836 మంది అర్హత సాధించారు. మళ్లీ సీటు రాని వారంతా, భారీ ఫీజులు చెల్లించలేక మెరుగైన ర్యాంకు కోసం నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు సిద్ధమవుతున్నారు.

ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 750 సీట్లు

కొత్తగా ఏర్పడిన వైద్య కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాలలకు, ప్రైవేట్ వైద్య కళాశాలలకు మధ్య తేడా లేకుండా పోయింది. 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన నంద్యాల, మచిలీపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయనగరం ఐదు ప్రభుత్వ వైద్య విద్యా కళాశాలల్లో 150 చొప్పున సీట్ల భర్తీకి జాతీయ వైద్య కమిషన్ ఆమోదముద్ర వేసింది. ఆయా కళాశాలల్లో మొత్తం 750 సీట్లు అందుబాటులోకి రాగా, అందులో 112 సీట్లు (15 శాతం) జాతీయ కోటా కింద భర్తీ చేస్తారు. మిగిలిన 638 సీట్లలో 50 శాతం సీట్లు (25 శాతం జనరల్, మరో 25 శాతం రిజర్వేషన్) కేటగిరీల కింద కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారని ఆశించిన విద్యార్థులు భంగపాటుకు గురయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా ఏ, బీ, సీ కేటగిరీలను ప్రవేశపెట్టింది. ఆయా కళాశాలల్లో 35 శాతం బీ-కేటగిరికి, 15 శాతం సీ-కేటగిరీకి సీట్లు కేటాయిస్తారు. ఏ-కేటగిరిలోని కన్వీనర్ కోటా కింద 50 శాతమే ఉండగా, దాంట్లో ఆల్ ఇండియా కోటా కింద 15 శాతం సీట్లు పోతే, ఇక కన్వీనర్ కోటా కింద 35 శాతమే విద్యార్థులకు మిగులుతాయి. దీంతో కొత్తగా ఏర్పాటయిన ఐదు వైద్య కళాశాలలతో అదనపు సీట్లు ఎలా పెరుగుతాయి?, దానివల్ల విద్యార్థులకు ఒరిగిందేమిటంటూ మండిపడుతున్నారు. ఏ, బీ, సీ కేటగిరీల ఫీజులను ప్రభుత్వం ఖరారు చేసింది. కన్వీనర్ కోటా (ఏ కేటగిరి) కింద వార్షిక ఫీజు రూ.15 వేలు, మిగిలిన 50 శాతం సీట్లలో బి-కేటగిరీ కింద 35 శాతం సీట్లకు రూ.12 లక్షలు, సీ-కేటగిరి (ఎన్నారై) కింద 15 శాతం సీట్లకు రూ.20 లక్షలు వసూలుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని జగన్ సర్కార్ ఆదేశించింది. ఈ ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మొత్తం ఐదు సంవత్సరాల పాటు ఎంబీబీఎస్ విద్యకుగాను బీ-కేటగిరీకి రూ.60 లక్షలు, సీ-కేటగిరీకి రూ.కోటి అవుతోంది. ఈ ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 50 శాతం సీట్లలో చదవబోయే విద్యార్థులు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో తరహాగా భారీ ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి దాపురించింది.

బీ, సీ కేటగిరీ సీట్లు రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్

ఇప్పటికైనా పేద విద్యార్థులకు జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వం గుర్తెరిగి కొత్తగా ప్రారంభించిన ఐదు వైద్య విద్య కళాశాలల్లో ప్రవేశపెట్టిన 50 శాతం బీ, సీ కేటగిరీల సీట్లను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరుతో వైద్య విద్యా వ్యాపారం కొనసాగుతోందన్నారు. పదేళ్ల క్రితమే అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈ విధానం మొదలైందని గుర్తు చేశారు. ఇదే విధానం కొనసాగితే పీజీ, సూపర్ స్పెషాల్టీ వైద్య కోర్సులకు కోట్ల రూపాయల ఫీజులు నిర్ణయిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ ప్రయత్నాలు విజయవంతమైన వెంటనే దేశ వ్యాప్తంగా జాతీయ వైద్య మండలి అనుమతులు పొందుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల అన్నింటిలోనూ వచ్చే విద్యా సంవత్సరం ఈ విధానం అమలులోకి రావచ్చని చెప్పారు. వైద్య విద్యలో కార్పొరేట్ శక్తులు బలపడే విధానాలను రూపొందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, వాటికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ కొత్త టీమ్

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షురాలు సోనియా గాంధీకి లేఖ రాసి, పార్టీ నాయకత్వంపై ప్రశ్నలు లేవనెత్తిన 23 మంది అసమ్మతి నేతల బృందంలో భాగమైన ముకుల్ వాస్నిక్, ఆనంద్ శర్మ, థరూర్‌లను సీడబ్ల్యూసీలోకి తీసుకున్నారు. మనీశ్ తివారీ, వీరప్ప మొయిలీలను సీడబ్ల్యూసీకి శాశ్వత ఆహ్వానితులుగా చేశారు. 2020లో రాజస్తాన్‌లో పార్టీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి, ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించబడిన సచిన్ పైలట్ కూడా కొత్త సీడబ్ల్యూసీ సభ్యులలో ఉన్నారు. సీడబ్ల్యూసీలో మాజీ ఎంపీ రఘువీర్ సింగ్ మీనా, జై ప్రకాశ్ అగర్వాల్, దినేశ్ గుండూ రావ్, హెచ్.కె.పాటిల్, కె.హెచ్.మునియప్ప, పి.ఎల్.పునియా, ప్రమోద్ తివారీ, రఘు శర్మ ఉన్నారు. ఆ తర్వాత కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో గుండూరావు, మునియప్ప, పాటిల్ మంత్రులు అయ్యారు. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ, ప్రతిభా సింగ్‌ను కూడా కమిటీలో చేర్చినట్లు కాంగ్రెస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్, ఎస్.రఘువీరా రెడ్డి, తామ్రధ్వాజ్ సాహు, దీపా దాస్‌మున్షీ, సయ్యద్ నసీర్ హుస్సేన్, మహేంద్రజీత్ సింగ్ మాలవీయ, జి.ఎ.మీర్, గౌరవ్ గొగోయ్, జగదీశ్ ఠాగూర్‌లను సీడబ్ల్యూసీ సభ్యులుగా తీసుకున్నారు. శాశ్వత ఆహ్వానితుల్లో కన్హయ కుమార్, మోహన్ ప్రకాశ్, కె.రాజు, చంద్రకాంత్ హండోర్, మీనాక్షి నటరాజన్, ఫూలోదేవి నేతమ్, సుదీప్ రాయ్ బర్మన్, దామోదర రాజ నరసింహ, గురుదీప్ సప్పల్, సచిన్ రావు ఉన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, పవన్ ఖేరా, గణేశ్ గొడియాల్, కొడిక్కునిల్ సురే యశోమతి ఠాకూర్, సుప్రియా శ్రీనాతే, ప్రిణితి షిండే, అల్కా లాంబా, వంశీచంద్ రెడ్డి ఉన్నారు. గత ఏడాది అక్టోబరు 10న పార్టీ అధ్యక్షుడిగా ఖర్గే బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఏర్పడిన స్టీరింగ్ కమిటీ స్థానంలో ఏర్పాటయిన కొత్త సీడబ్ల్యూసీ రానున్న రోజుల్లో జరిగే సాధారణ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలకు ప్రధాన ప్రతిపక్ష పార్టీ సిద్ధమవుతున్న తరుణంలో ప్రకటించారు. సోనియా గాంధీ అధ్యక్షతన సెప్టెంబరు 11, 2020న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని చివరిసారిగా పునర్నిర్మించారు. మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఏర్పడిన తొలి కార్యవర్గం ఇదే. అనేక దఫాలుగా చర్చల అనంతరం కొత్త కార్యవర్గం ఏర్పాటయింది. అయితే 84 మంది సభ్యుల సంఘంలో ఆరుగురు సాధారణ సభ్యులు, నలుగురు శాశ్వత ఆహ్వానితులు, ఐదుగురు ప్రత్యేక ఆహ్వానితులతో సహా మహిళలు 15 మంది మాత్రమే ఉన్నారు.

సీడబ్ల్యూసీ సభ్యులు వీరే...

సీడబ్ల్యూసీ సభ్యులుగా మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ, అధిర్ రంజన్ చౌదరి, ఎ.కె.ఆంటోనీ, అంబికా సోని, మీరా కుమార్, దిగ్విజయ సింగ్, పి.చిదంబరం, తారిక్ అన్వర్, లాల్ థన్హావాలా, ముకుల్ వాస్నిక్, ఆనంద్ శర్మ, అథోక్రావ్ చవాన్, అజయ్ మాకెన్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ, ప్రియాంక గాంధీ వాద్రా, కుమారి సెల్జా, గైఖాంగమ్, ఎన్.రఘువీరా రెడ్డి, శశి థరూర్, తామ్రధ్వజ్ సాహు, అభిషేక్ సింఘ్వీ, సల్మాన్ ఖుర్షీద్, జైరాం రమేశ్, జితేంద్ర సింగ్, రణ్‌దీప్ సూర్జేవాలా, సచిన్ పైలట్, దీపక్ బబారియా, జగదీష్ ఠాకోర్, జి.ఎస్.మీర్, అవినాశ్ పాండే, దీప దాస్ మున్షి, మహేంద్ర జిత్ సింగ్ మాలవియా, గౌరవ్ గొగోయ్, సయ్యద్ నసీర్ హుస్సేన్, కమలేశ్వర్ పటేల్, కె.సి.వేణుగోపాల్ ఉన్నారని ఆ ప్రకటన పేర్కొంది.

అవినీతికి నిలయం హోంశాఖ

(మొదటిపేజీ తరువాయి)

చీఫ్ విజిలెన్స్ అధికారులకు మూడు నెలల కాలపరిమితిని నిర్దేశించిందని ఒక అధికారి తెలిపారు. హోం మంత్రిత్వ శాఖ తన ఉద్యోగులపై గత ఏడాది 46,643 ఫిర్యాదులు అందుకోగా, రైల్వేలకు 10,580, బ్యాంకుల ద్వారా 8,129 ఫిర్యాదులు అందాయి. హోం మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై వచ్చిన మొత్తం ఫిర్యాదులలో 23,919 పరిష్కారం అయ్యాయి. 22,724 పెండింగ్‌లో ఉండగా, 19,198 మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించింది. రైల్వేలు 9,663 ఫిర్యాదులను పరిష్కరించగా, 917లో మూడు నెలలకు పైగా తొమ్మిది పెండింగ్‌లో ఉన్నట్లు ఇటీవల వెల్లడించిన నివేదిక పేర్కొంది. బ్యాంకులు 7,762 అవినీతి ఫిర్యాదులను పరిష్కరించాయి. 367లో 78 మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఢిల్లీలోని జాతీయ రాజధాని ప్రాంత ప్రభుత్వ ఉద్యోగులపై 7,370 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో 6,804 పరిష్కారమయ్యాయి. 566 పెండింగ్‌లో 18 మూడు నెలలకు పెండింగ్‌లో ఉన్నాయి. గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (కేంద్ర ప్రజా పనుల విభాగంతో సహా), ఢిల్లీ అభివృద్ధి మండలి, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్, ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్, హిందుస్థాన్ ప్రిఫ్యాబ్ లిమిటెడ్, గృహ, పట్టణ అభివృద్ధి సంస్థ, ఎన్‌బీసీసీ, ఎన్‌సీఆర్ ప్రణాళిక బోర్డు ఉద్యోగులపై 4,710 ఫిర్యాదులు వచ్చినట్లు నివేదిక పేర్కొంది. వీటిలో 3,889 పరిష్కారం కాగా, 821లో 577 మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. సీవీసీ వార్షిక నివేదిక ప్రకారం, బొగ్గు మంత్రిత్వ శాఖలోని వారిపై 4,304 ఫిర్యాదులు, (4,050 పరిష్కారమయ్యాయి), కార్మిక మంత్రిత్వ శాఖలో 4,236 ఫిర్యాదులు (4,016 పరిష్కారమయ్యాయి), పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 2,617 ఫిర్యాదులు (2,409 పరిష్కరించబడ్డాయి) ఉన్నాయి. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఉద్యోగులపై 2,150 ఫిర్యాదులు, రక్షణ మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 1,619, టెలికమ్యూనికేషన్ శాఖ ఉద్యోగులపై 1,308, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 1,202, కేంద్ర ప్రత్యక్ష పన్నులు, కస్టమ్స్ (సీబీఐసీ) ఉద్యోగులపై 1,101 ఫిర్యాదులు వచ్చాయని నివేదిక తెలిపింది. బీమా కంపెనీల్లో పని చేస్తున్న వారిపై 987, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖలోని ఉద్యోగులపై 970, ఉక్కు మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 923 ఫిర్యాదులున్నాయని పేర్కొంది.

ఇక ఇంధనం వంతు

న్యూఢిల్లీ: దేశంలో కొంతకాలంగా ద్రవ్యోల్బణం తారస్థాయికి చేరుకుంది. నిత్యావసరాలు, కూరగాయలు, పప్పు, బియ్యం ధరలు భారీగా పెరిగాయి. ఇటీవల టమాటా కిలో రూ.200 పలికింది. ఆ తర్వాత ఆపిల్, బియ్యం, ఉల్లి వంటివి ధర పెరుగుతున్నాయి. ఇక ఇంధనం కూడా మరింత ప్రియం కాబోతోందన్న అంచనాలు ఉన్నాయి. అంతర్జాతీయ చమురు ధరలు, రవాణా, రిఫైనింగ్ ఖర్చులు, పన్నులపై దేశీయంగా ఇంధన ధరలు ఆధారపడతాయి. చమురు కంపెనీలకు ప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వదు కాబట్టి అంతర్జాతీయంగా ధర పెరిగితే దేశీయ ద్రవ్యోల్బణం ప్రభావితం అవుతుంది. ఇదే విషయాన్ని ఆర్థికశాఖ అధికారి తెలిపారు. అదే సమయంలో కొత్త పంట మార్కెట్‌లోకి రాబోతుండటంతో మరో నెల రోజుల్లో కూరగాయల ధరలు దిగివస్తాయని అన్నారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించే ఆలోచన లేదని కూడా చెప్పారు. ఆర్థికశాఖ అధికారి తాజాగా పీటీఐతో మాట్లాడుతూ చమురు మార్కెటింగ్ కంపెనీలకు కేంద్రప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీలు ఉండవు కాబట్టి ముడి చమురు ధరలు బడ్జెట్ అంచనాలను ప్రభావితం చేయవని తెలిపారు. ఇంధన ధరలను తగ్గించే చర్యలపై ప్రశ్నకు స్పందిస్తూ చమురు ధరల్లో హెచ్చుతగ్గుల ప్రభావం ఆర్థిక మార్కెట్ల అంచనాలపై ఉండబోదని చెప్పారు. ప్రస్తుతానికి ముడిచమురు బ్యారల్ ధర 85 డాలర్లుగా ఉంటే బడ్జెట్ సమయంలో బ్యారల్ ధర 70-73 డాలర్ల మేర ఉన్నట్లు వెల్లడించారు. ముడిచమురు ధర పెరగడం ఆందోళనకమే అయినా చమురు కంపెనీల దృష్టికోణంలో అవి భరించదగ్గ స్థాయిలోనే ఉన్నాయని అన్నారు. ప్రస్తుతానికి విధానపరమైన సద్దుబాట్ల అవసరం లేదని చెప్పారు. బడ్జెట్ లెక్కలు సరైన రీతిలోనే ఉన్నాయని తెలిపారు. బ్యారల్ ధర 80-85 డాలర్లు లేక 90డాలర్ల వరకు పెరిగినా సర్వాలేదన్నారు. అంతకుమించి ధర పెరిగితే మాత్రం ద్రవ్యోల్బణంతో పాటు ఇతరత్రాలపై ప్రభావం ఉంటుందని అధికారి తెలిపారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించే ఆలోచన ప్రస్తుతానికి లేదని స్పష్టంచేశారు. మౌలిక వసతులకు పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు పెట్టుబడలు ఊపందుకోవల్సి ఉన్నట్లు చెప్పారు. జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి కేంద్ర మూలధన వ్యయం... బడ్జెట్ అంచనాల్లో 28శాతంగా ఉంటే సెప్టెంబరు చివరికి 50శాతానికి పెరుగుతుందని అధికారి తెలిపారు. 2023-24 బడ్జెట్‌లో మూలధన వ్యయాన్ని 33శాతం పెంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.10లక్షల కోట్లుకు చేర్చినట్లు చెప్పారు. ఆరు శాతం వర్షలోటు ప్రభావం ఖరీఫ్ సాగుపై ఉండబోదన్నారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు రిజర్వులను విడుదల చేస్తున్నట్లు అధికారి చెప్పారు. బియ్యం, చక్కెర ఎగుమతులను ప్రభుత్వం నిషేధించిందని, పప్పుల దిగుమతులకు అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. ధరలను నియంత్రణలో ఉంచేందుకు అనువైన వాణిజ్య విధానాన్ని అనుసరిస్తోందని తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా సరఫరా గొలుసులు ప్రభావితమై ధరలు పెరిగాయని, ఇది అంతర్జాతీయ పరిణామానమని, భారత్ మినహాయింపు కాదన్నారు. ద్రవ్యోల్బణం నుంచి దేశ జనభాను దూరంగా ఉంచేందుకు చేసిన ప్రయత్నాల వల్ల చాలా దేశాలతో పోల్చితే భారత్ పరిస్థితి మెరుగ్గా ఉందని అన్నారు. టమాటా సీజనల్ పంట కావడంతో కొత్త పంట రాగానే ధర తగ్గుతుందని చెప్పారు. వచ్చే నెలకల్లా కూరగాయల ధరలన్నీ తగ్గుతాయన్నారు. ఇదిలావుంటే, రీటైల్ ద్రవ్యోల్బణం 15నెలల గరిష్ఠానికి చేరుకుంది. జులైలో 7.44శాతంగా నమోదైంది. జూన్‌లో 4.87శాతంగా ఉంది. టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం వరుసగా నాల్గో నెలలోనూ మైనస్ 1.36గా ఉంది.

హిజ్రాలకు హక్కులు కల్పించేలా చర్యలు చేపట్టండి

సీఎంకు లేఖ రాసిన రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని హిజ్రాలను స్త్రీ, పురుషులతో సమానంగా మూడో మనిషిగా గుర్తించి, హక్కులు కల్పించేందుకు చర్యలు చేపట్టవలసిందిగా కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి లేఖ రాశారు. సమాజంలో హిజ్రాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని, వారికి జీవనం కడు దుర్భరంగా మారిందని తెలిపారు. సాధారణ ప్రజల విషయంలో ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ట్రాన్స్ జెండర్ వ్యక్తులకు ఇప్పటికీ అందడం లేదని పేర్కొన్నారు. 2014 ఏప్రిల్ 15న సుప్రీం కోర్టు ట్రాన్స్‌జెండర్లను సమాజంలో మూడో మనిషిగా గుర్తించాల్సిన అవసరాన్ని నల్సా తీర్పు రూపంలో స్పష్టం చేసిందని గుర్తు చేశారు. హిజ్రాలను థర్డ్ జెండర్‌గా గుర్తించి స్త్రీ, పురుషులతో సమానంగా హక్కులు కల్పించాలనేది ఆ తీర్పు సారాంశం అన్నారు. క్షేత్రస్థాయిలో ఆ తీర్పు ఎక్కడా అమలు కావడం లేదని తెలిపారు. హిజ్రాలకు సామాజిక భద్రత, ఆపదలో మద్దతు, గౌరవప్రదమైన జీవనోపాధి అవకాశాలు కల్పించటానికి వ్యవస్థాగత, దీర్ఘకాలిక చర్యలను చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రభుత్వాలు తమ బాధ్యతగా ది కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ 1973లోని సెక్షన్ 154 ప్రకారం వారిపై హింసకు పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చెయ్యాలని పేర్కొన్నారు. ఐపీసీలోని సెక్షన్ 357 (ఎ), (బి) కింద హింసకు గురైన కుటుంబానికి తగిన పరిహారం ఇవ్వాలన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన నల్సా తీర్పు ప్రకారం, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల కోసం రిజర్వేషన్లు, అన్ని ప్రభుత్వ పథకాలను అమలు చేయడం ద్వారా వారికి అందరితో సమానంగా విద్య, వైద్యం, జీవనోపాధి అవకాశాలను, ఆర్థిక స్వావలంబన అవకాశాలను విస్తరించాలని కోరారు. ఆపదలో ఉన్న ట్రాన్స్‌జెండర్ల కోసం అత్యవసర మద్దతు అందించేలా 24 గంటల హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. వాటిలోనూ ట్రాన్స్‌జెండర్ల నియామకం, అవసరమైన శిక్షణ, నైపుణ్యాలు, వనరులను అందించాలని సూచించారు. హిజ్రాలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులను మంజూరు చేయడం, జీవన భృతి కల్పన, నివేశన స్థలాలు, ఇళ్ల నిర్మాణం, నాణ్యమైన వైద్యం, అవసరమైన సమయాల్లో ప్రభుత్వం తరపున తక్షణ న్యాయ సహాయం అందించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాజంలో స్త్రీ, పురుషులతో పాటు ట్రాన్స్‌జెండర్‌లు కూడా మూడో మనిషేనన్న విచక్షణ మరింత పెరిగేలా సామాజిక అవగాహన కల్పించేందుకు తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని రామకృష్ణ కోరారు.

కడియం ఎస్సై శివాజీని అరెస్టు చేయాలి

దళిత యువకుడిపై దాష్టీకం ప్రదర్శించిన తూర్పు గోదావరి జిల్లా కడియం ఎస్సై ఆర్.శివాజీని అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో దళితులపై దమనకాండ కొనసాగుతోందనడానికి కడియంలో జరిగిన ఘటనే తార్కాణం అన్నారు. ఒక మహిళ అదృశ్యం విషయంలో అనుమానితుడికి వాహనం ఇచ్చాడనే అభియోగంపై తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం కుంకుడుమిల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు వడ్డి వెంకట ప్రసాద్‌ను కడియం ఎస్సై ఆర్.శివాజీ అసభ్య పదజాలంతో దూషించి, విచక్షణా రహితంగా కొట్టి, మూత్రం తాగమని చెప్పడం దుర్మార్గం అన్నారు. గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సీతానగరం మండలం పోలీసు స్టేషన్‌లోనే వరప్రసాద్ అనే దళిత యువకుడికి శిరోముండనం చేసిన ఘటన జరగడం, కాకినాడలో సాక్షాత్తూ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ తన మాజీ డ్రైవరయిన సుబ్రమణ్యం అనే దళిత యువకుడిని కొట్టి చంపి, డోర్ డెలివరీ చేసిన ఘటనలు గమనార్హం అన్నారు. ప్రజలకు భద్రత, భరోసా, నమ్మకం కల్పించాల్సిన పోలీసులు అత్యంత దుర్మార్గంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక రాష్ట్రంలో పోలీసు వ్యవస్థకు విలువ లేకుండా పోతోందన్నారు. కేవలం అధికార వైసీపీకి వత్తాసు పలుకుతూ ప్రతిపక్షాలను, దళిత, మైనారిటీలను వేధించడమే పనిగా పెట్టుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. వడ్డి వెంకట ప్రసాద్‌పై అమానుషంగా ప్రవర్తించిన కడియం ఎస్సై శివాజీని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాతంత్ర వాదులంతా ఈ ఘటనను ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

లోయలో పడిన ఆర్టీసీ బస్సు

- పాడేరు ఘాట్ రోడ్డులో దుర్ఘటన
- ఇద్దరి మృతి... 30 మందికి గాయాలు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఘాట్ రోడ్డులో ఆదివారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో ఇద్దరు మృతి చెందగా 30 మంది గాయపడ్డారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఆదివారం సాయంత్రం పాడేరు నుంచి చోడవరం వెళుతున్న ఆర్టీసీ బస్సులో సుమారు 60 మంది ప్రయాణికులు ఉన్నట్టు తెలుస్తోంది. పాడేరు వ్యూ పాయింట్ వద్దకు చేరుకోగానే బస్సు అదుపుతప్పి 100 అడుగుల లోయలో పడినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ దుర్ఘటనలో ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. క్షతగాత్రులను పాడేరు ఆస్పత్రికి, మరికొంతమందిని విశాఖపట్నం కేజీహెచ్ కు తరలించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కాగా ఈ దుర్ఘటనపై జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ బస్సు ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిందిగా తమకు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. అవసరమైతే అనకాపల్లి, విశాఖపట్నం నుంచి వైద్యులను తరలించి అయినా క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించనున్నట్టు తెలిపారు.

సీఎం దిగ్భ్రాంతి

పాడేరు ఘాట్ రోడ్డులో ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల కలెక్టర్లను, పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ ప్రమాదానికి దారి తీసిన కారణాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు.

చంద్రబాబుతో యార్లగడ్డ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతో వైసీపీకి రాజీనామా చేసిన గన్నవరం నేత యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. తనకు టికెట్‌పై అధిష్ఠానం స్పం దించనందుకు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు ఇటీవల యార్లగడ్డ ప్రకటించిన విషయం విదితమే. చంద్రబాబును కలిసిన తర్వాత వెంకట్రావు మీడియాతో మాట్లాడుతూ 19 ఏళ్లు తాను అమెరికాలో ఉన్నప్పటికీ ఆ తర్వాత రాజకీయాలపై ఆసక్తితో స్వదేశానికి రావడం, తదితర విషయాల్ని చంద్రబాబుకు వివరించినట్లు తెలిపారు.

త్వరలో టీడీపీలో చేరతా: యార్లగడ్డ

టీడీపీలో చేరేందుకు తన సమ్మతిని తెలిపానని, కలిసి పనిచేద్దామని చంద్రబాబు అన్నారని యార్లగడ్డ తెలిపారు. ప్రజాప్రతినిధిగా ఉంటే తప్ప రాజకీయాల్లో మనుగడ సాధించలేమని భావించి వైసీపీలో చేరి గన్నవరంలో ఆ పార్టీ తరపున గత ఎన్నికల్లో పోటీచేశానని యార్లగడ్డ గుర్తుచేశారు. టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి వైసీపీకి మద్దతు తెలపడంతో తనను పక్కన పెట్టారని, దీంతో మూడున్నర ఏళ్లుగా తనతో పాటు తనవర్గం పడుతున్న ఇబ్బందులను చంద్రబాబుకు వివరించానని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలపైనే చంద్రబాబు ఎప్పుడూ ఆలోచిస్తుంటారన్నారు. టీడీపీలో చేరాలని నిర్ణయం తీసుకున్నందున ఇకపై పార్టీ ఏం చెబితే అది చేస్తానన్నారు. గన్నవరం టీడీపీ టికెట్‌పై హామీ లభించిందా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, పార్టీ ఎక్కడ పోటీ చేయ మంటే అక్కడ నుంచి పోటీ చేస్తానని యార్లగడ్డ సమాధానమిచ్చారు. పార్టీ ఆదేశిస్తే గన్నవరం, గుడివాడ, విజయవాడ... ఇలా ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానని ఆయన అన్నారు. లోకేశ్ పాదయాత్ర గన్నవరానికి చేరే సమయంలో అక్కడ బహిరంగ సభ పెట్టి పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు యార్లగడ్డ సిద్ధమయ్యారు.

26న తుళ్లూరు రైతులతో ముఖాముఖి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-తుళ్లూరు: రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి... నినాదంతో సీపీఐ అధ్వర్యంలో విశాఖపట్నంలో ప్రారంభమైన బస్సు యాత్ర ఈ నెల 26న గుంటూరు జిల్లాకు చేరుకుంటుందని, ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు తుళ్లూరులో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. రాజధాని ప్రాంతం తుళ్లూరులోని రైతు దీక్షా శిబిరాన్ని ముప్పాళ్ల ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బస్సు యాత్రను విజయవంతం చేసే కార్యక్రమంలో భాగంగా 26న తుళ్లూరులో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు అమరావతి గళం విని పించాలన్నారు. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభలో రైతులు, రైతు కూలీలు, మహిళలు, చేతివృత్తిదారులు, ఇతర వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అమరావతి ఉద్యమానికి మొదటి నుంచి సీపీఐ మద్దతుగా నిలిచిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాష్ట్రం, దేశ హితం కోసం బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. నరేంద్ర మోదీ అండతోనే జగన్ మోహన్ రెడ్డి దుర్మార్గపు పాలన సాగిస్తున్నాడని మండిపడ్డారు. సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేశాయన్నారు. అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జగన్‌మోహన్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి... కేసుల నుంచి తప్పించుకోవడానికే తప్ప ప్రజలకు మేలు చేయడానికి కాదన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర ప్రగతి కోసం కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలకు చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకర రావు, ఏఐటీయూసీ కార్యదర్శి, న్యాయవాది జి.వి.రాజు, కె.దేవుని దయ, రైతు జేఏసీ నాయకులు ధనేకుల రామారావు, గౌర్నేని స్వరాజ్యరావు, కాటా అప్పారావు, మహిళ రెత్తు గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తుళ్లూరులోని సాయిబాబా మందిరం సమీపంలో సభాస్థలిని సీపీఐ, రైతు నాయకులు పరిశీలించారు.

నేటి నుంచి ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర మహాసభలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఏపీ ఎన్జీవో సంఘం 21వ రాష్ట్ర మహాసభలు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొని, మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి కోరారు. ఆదివారం స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మూడేళ్ల కొకసారి జరగవలసిన మహాసభలు కోవిడ్ వల్ల ఆలస్యమైనట్లు తెలిపారు. 21వ రాష్ట్ర మహాసభలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డితో సహా మంత్రులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించి మహాసభ తీర్మాని స్తుందని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతాపరంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులు క్రమశిక్షణతో మహాసభను జయప్రదం చేయాలని కోరారు. 74 ఏళ్ల చరిత్ర కలిగిన ఏపీఎన్జీవోలో ఇప్పటివరకు 11 పీఆర్సీలు సాధించిందని, ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీలను ఇప్పించామని గుర్తుచేశారు. ఏ రాజకీయ పార్టీ ప్రభావంలేకుండా నడుస్తున్న ఏకైక ఉద్యోగ సంఘం ఏపీ ఎన్జీవో సంఘం అని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. మెరుగైన 12వ పీఆర్సీని సైతం ఏపీఎన్జీవో సాధిస్తుందని దీమాగా చెప్పారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జిల్లాలో రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ముగ్గురి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- తండ్రి కర్మకాండకు వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు

విశాలాంధ్ర-చెన్నూరు: వైఎస్సార్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ (ఖైరతాబాద్) కు చెందిన కొండేటి కృష్ణ తండ్రి తిరుపతిలో మరణించడంతో ఆయన కర్మకాండకు కుటుంబంతో వెళ్లి తిరిగి హైదరాబాద్ వెళుతుండగా కడప-కర్నూలు జాతీయ రహదారి చెన్నూరు ఆంధ్ర స్పైస్ సమీపంలో రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొంది. లారీ కిందికి కారు దూసుకుపోవడంతో కొండేటి కృష్ణ (48), కృష్ణ అత్త పద్మావతి (60), కుమారుడు రిషి (15) అక్కడికి అక్కడే మృతి చెందగా, కృష్ణ భార్య విజయ రాణి, కుమార్తె నిహారిక (19) తీవ్రంగా గాయపడ్డారు. రిషి పదవ తరగతి చదువుతున్నాడని, నిహారిక లాంగ్ టర్మ్ కోచింగ్ (మెడిసిన్) తీసుకుంటుందని తెలిపారు. తమిళనాడుకు చెందిన లారీ ఉప్పు లోడుతో హైదరాబాద్‌లోని తిమ్మాపూర్‌కు వెళుతూ చెన్నూరు ఆంధ్ర స్పైస్ సమీపంలో చెట్ల వద్ద పక్కన నిలబెట్టుకొని డ్రైవర్ వంట చేసుకుంటూ ఉండగా ఈ దుర్ఘటన జరిగినట్లు పోలీసులు వివరించారు. రోడ్డు ప్రమాదం సమాచారం తెలియగానే ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని లారీ కింద ఇరుక్కున్న కారును బయటకు లాగి క్షతగాత్రులను హుటాహుటిన 108లో కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

'వికసిత భారత్-2047'ను బాబు కాపీ కొట్టారు

విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏడాది క్రితమే నీతి ఆయోగ్ 'వికసిత భారత్-2047' ప్రణాళికను విడుదల చేసిందని దీనినే విజన్-2047 అని పేరుమార్చి చంద్రబాబు కాపీ కొట్టారని, బాబు గారి సొంత బ్రాండింగ్ ఏమీ కాదని రాజ్యసభ సభ్యుడు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి విమర్శించారు. వివిధ అంశాలపై 'ఎక్స్' వేదికగా ఆదివారం ఆయన స్పందిం చారు. 2047 నాటికల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అగ్రస్థానంలో ఉంటుందంటూ అందులో నీతి ఆయోగ్ పేర్కొందని చెప్పారు. దానినే చంద్రబాబు కాపీ కొట్టి దేశానికి, రాష్ట్రానికి తాను దిశా నిర్దేశం చేస్తున్నట్టు గొప్పలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఆంధ్రాలో పెట్టుబడులు పెట్టొద్దంటూ హైద్రాబాద్‌లో కూర్చొని ఏపీ విపక్షనేత చంద్రబాబు పిలుపునివ్వడం, వారి నిరాశ, నిస్పృహలను అర్థం చేసుకోవచ్చున్నారు. 2019లో ఎదురైన ఓటమి వల్ల పగతో వైసీపీపై రగిలిపోతున్నారని చెప్పారు. 2024లో మళ్లీ ఓడిస్తే అర్థంలేని మాటలు మానేసి చంద్రబాబు మామూలు మనిషి అవుతారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నిక ఏదైనా ఫ్యాన్‌దే ప్రభంజనమని సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికల్లో 85 శాతానికి పైగా వైసీపీ కైవసం చెసుకుందని చెప్పారు.

బుట్టా రేణుక పయనమెటు?

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: మాజీ ఎంపీ బుట్టారేణుక 2024 పార్లమెంటు ఎన్నికల బరిలో నిలుస్తారా లేదా అన్న విషయమై రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. 2014లో అనూహ్యంగా కర్నూలు పార్లమెంట్ బరిలో వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన బుట్టారేణుక... 24వేల ఓట్ల పైచిలుకు మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నికల బరిలో నిలిచిన అనతికాలంలోనే మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి (కాంగ్రెస్), బీటీ నాయుడు (టీడీపీ)ను వెనక్కు నెట్టి కర్నూలు పార్లమెంట్ స్థానంలో ఆమె విజయం సాధించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఎంపీగా ఆమె ప్రజలతో మమేకమై పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో తిరుగుతూ అభివృద్ధిపై దృష్టి సారించారు. ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. తరువాత అధికార టీడీపీలో చేరిపోయారు. కర్నూలు పార్లమెంట్‌లో మొదటి మహిళా ఎంపీగా ఎన్నికైన బుట్టా... టీడీపీ ప్రభుత్వ హయాంలో తన పార్లమెంట్ పరిధిలో అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందారు. 2019 ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో ఉన్న కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి టీడీపీలో చేరడం ఆమెకు ఇబ్బందికరంగా మారింది. కర్నూలు పార్లమెంట్ సీటు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డికి ఇచ్చేందుకు టీడీపీ అధినేత నిర్ణయం తీసుకోవడంతో తనకు ఎమ్మిగనూరు, ఆదోని అసెంబ్లీ సీటు అయినా ఇవ్వాలని బుట్టా టీడీపీపై ఒత్తిడి తీసుకురాగా అందుకు ససేమిరా అనడంతో వైసీపీలో చేరిపోయారు. ఎన్నికల ముందు మరలా వైసీపీలో చేరి వైసీపీ అభ్యర్థుల విజయం కోసం కృషిచేస్తానని ఆపార్టీ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హామీ ఇచ్చారు. పార్టీ అధికారంలోకి వస్తే తనకు ఏదైనా పదవి వస్తుందని ఆమె ఆశించి ఉండవచ్చు కానీ నాలుగున్నరేళ్లయినా... నేటికి ఎటువంటి పదవి ఆమెకు దక్కలేదు. 2024 ఎన్నికలలో మరోసారి తనకు కర్నూలు ఎంపీ సీటు వస్తుందని ఆమె ఆశించినా... కర్నూలు ఎంపీ సీటు తిరిగి తనకే ఇవ్వాలని సిట్టింగ్ ఎంపీ సంజీవకుమార్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరడం... ఆ మేరకు ఆయన నుంచి హామీ తీసుకోవడం జరిగిపోయింది. ఈ స్థితిలో బుట్టా... తన సొంత నియోజకవర్గం పత్తికొండ లేదా ఎమ్మిగనూరు అసెంబ్లీ సీటు అయినా ఇవ్వాలని అదిష్ఠానం ముందు ప్రతిపాదించినట్లు తెలిసింది. కాగా పత్తికొండ సిట్టింగ్ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కూడా రానున్న ఎన్నికల్లో తిరిగి పత్తికొండ నుంచి పోటీచేసేలా సీఎం జగన్ వద్ద హామీ పొందినట్లు తెలిసింది. పత్తికొండలో సీఎం పర్యటన విజయవంతం కావడం ఆమెకు కలిసొచ్చే అంశం కానుంది. ఇక ఎమ్మిగనూరు నియోజకవర్గం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వయోభారంతో ఈసారి ఎన్నికలలో పోటీ చేయనని ఇప్పటికే ప్రకటించినా... తన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డికి సీటు ఇప్పించుకునేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మిగనూరులో టీడీపీని ఢీకొట్టాలంటే అది చెన్నకేశవరెడ్డి తప్ప ఎవరికి సాధ్యం కాదన్న ప్రచారం ఉంది. కాగా ఇటీవల మంగళగిరి అసెంబ్లీ స్థానం నుంచి బుట్టా రేణుకను బరిలో దింపాలని వైసీపీ ప్రయత్నం చేస్తోందన్న పుకార్లొచ్చాయి. మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిపై నియోజకవర్గంలో వ్యతిరేకత ఉండటమే కాకుండా బుట్టారేణుక సామాజిక వర్గం అధికంగా ఉండటం వల్ల మంగళగిరిలో టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగనున్న యువనేత నారా లోకేశ్‌పై పోటీ దిగుతారని అనుకున్నారు. కాగా వైసీపీ నాయకత్వం నారా లోకేశ్‌ను ఓడించడానికి దీటైన అభ్యర్థికోసం వైసీపీ అన్వేషిస్తోంది. ఏది ఏమైనా మాజీ ఎంపీ బుట్టారేణుక వైసీపీ ఏ సీటు కేటాయిస్తుందన్న విషయంలో ఇంత వరకు ఎటువంటి నిర్ణయం జరగలేదు. అసలు వైసీపీ సీటు ఇస్తుందో లేదో కూడా హామీ ఇవ్వక పోవడం విశేషం. అయితే 2024 ఎన్నికల బరిలో నిలిచే ఉద్దేశంతో బుట్టా రేణుక ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ కాకుండా ఏపార్టీ సీటిస్తే ఆపార్టీలో చేరే అవకాశం లేకపోలేదన్న ప్రచారం ఉంది.

నవ సమాజానికి రాజీవ్ బాటలు

గిడుగు రుద్రరాజు ఘన నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంతో నవ సమాజానికి బాటలు వేశారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చెప్పారు. రాజీవ్‌గాంధీ 79వ జయంతిని పురస్కరించుకుని విజయవాడలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో ఆదివారం ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రరత్న భవన్ నుంచి సింగ్‌నగర్ ఫ్లైఓవర్ దగ్గర ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ రాజీవ్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం రుద్రరాజు మాట్లాడుతూ భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టాలని, దేశంలో పేదరికాన్ని నిర్మూలించాలని రాజీవ్‌గాంధీ అనేక సంస్కరణలు చేపట్టారని గుర్తు చేశారు. పేద, ధనిక తారతమ్యాలను తగ్గించే సంకల్పంతో మానవవనరుల శాఖను ఏర్పాటు చేసి...దానికి పీవీ నరసింహారావును మంత్రిగా చేశారని తెలిపారు. తనకున్న విజన్‌తో శాస్త్ర, సాంకేతికరంగాల్లో సరికొత్త అభివృద్ధికి రాజీవ్ బాటలు వేశారన్నారు. నూతన జాతీయ విద్యావిధానంతో విద్య అందరికీ దక్కాలనే మహోన్నత ఆశయంతో నవోదయ, ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు గిడుగు రుద్రరాజు వివరించారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా గిడుగు రుద్రరాజు అధ్వర్యంలో పేదలకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. సింగ్‌నగర్‌లోని రాజీవ్ విగ్రహం వద్ద పేదలకు, రిక్షా కార్మికులకు పండ్లు పంపిణీ చూసిన నాయకులు...గాంధీనగర్‌లోని చైల్డ్ లైన్‌తో పాటు అనాథలకు ఆశ్రయం ఇచ్చే నవజీవన్ బాలభవన్‌లో చిన్నారులకు మిఠాయిలు అందజేశారు. కాగా 10వ డివిజన్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ కార్పొరేటర్ నజీర్ హుస్సేన్‌తోపాటు మరికొందరు రుద్రరాజు అధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మస్తాన్ వలి, సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, ఏఐసీసీ సభ్యులు కొలనుకొండ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ పాదయాత్ర...సాయంత్రపు నడక

వైసీపీ నేతల విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: లోకేశ్ పాదయాత్ర సాయంత్రపు నడకలా ఉందని, ఆయన పాదయాత్రకు ప్రజాదరణ లేనందునే, చంద్రబాబు తన దత్తపుత్రుడిని రంగంలోకి దించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ విమర్శించారు. ఆదివారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్‌తో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వెలంపల్లి మాట్లాడుతూ... లోకేశ్ పాదయాత్రను ఆ పార్టీ ఎంపీలే బహిష్కరించారన్నారు. నాటి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 45 దేవాలయాలను కూల్చేశారని గుర్తుచేశారు. పొట్టి శ్రీరాములను అవమానించిన మీరా ఆర్యవైశ్యుల్ని గౌరవించేదీ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్గమ్మ దేవాలయంలో క్షుద్ర పూజలు చేసిందీ మీరు కాదా?, అమరావతిలో ఇళ్ల స్థలాలు ఇస్తుంటే అడ్డుకుంది మీరు కాదా? అని ప్రశ్నించారు. లోకేశ్... గుంటూరు, కృష్ణాజిల్లాల పేదలకు క్షమాపణలు చెప్పి ముందుకు కదలాలన్నారు. నాడు ప్రకాశం బ్యారేజీపై ప్రతిపక్షనేత వైఎస్ జగన్ పాదయాత్రకు టీడీపీ అనుమతివ్వలేదని గుర్తుచేశారు. తాము లోకేశ్ యాత్ర ఎక్కడా అడ్డుకోలేదని, ప్రకాశం బ్యారేజీపై కూడా అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు. విజయవాడకు చంద్రబాబు ద్రోహం చేశారంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్, లోకేశ్ ముగ్గురూ హిందూ ద్రోహులని దుయ్య బట్టారు. 175 నియోజకవర్గాల్లో పోటీ చేస్తామనే దమ్ముందా ? అని సవాల్ విసిరారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ... ప్రకాశం బ్యారేజీపై లోకేశ్ ఫోటో షూట్‌కు రూ.5 కోట్లు ఖర్చు చేసి కిరాయి జనాన్ని తెచ్చుకున్నారని విమర్శించారు. విజయవాడ నుంచి వెళ్లేప్పుడు తమ ప్రభుత్వం చేసిన పనులు ఏంటో చెప్పుకోలేని దుస్థితిలో లోకేశ్ ఉన్నాడన్నారు. విజయవాడ నగరాన్ని జన్మభూమి కమిటీల పేరుతో పూర్తిగా అవినీతి నిలయంగా మార్చారని, విజయవాడ నగరానికి కేంద్రం రూ.500 కోట్లు ఇస్తే ఆ నిధులనూ దారిమళ్లించారని ధ్వజమెత్తారు. దేవినేని అవినాశ్ మాట్లాడుతూ నారా లోకేశ్ పాదయాత్రకు బాహుబలి స్థాయిలో బిల్డప్ ఇచ్చారనీ, అది సంపూర్ణేష్ బాబు సినిమాలా మారిందన్నారు. ఆయన పాదయాత్రకు వాళ్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు రాకపోతే పక్క జిల్లాలు, నియోజకవర్గాల నుంచి రప్పించుకున్నారని విమర్శించారు.

అభిమానపు వెల్లువైన కవిత్వం

అనునిత్యం రాక్షసత్వం జాలువారుతుంటే, దారుణమారణ హోమంతో ప్రపంచం ఒకవైపు అల్లకల్లోలం అయిపోతున్నా మనిషి ఈ భూమ్మీద ఇంకా ఇంకా మనుగడ సాగిస్తున్నాడంటే అందుకు కారణం మరోవైపు దైవత్వం లాంటి అభిమానపు వెల్లువ కురుస్తూ వుండడమే. జీవితంలోని వొకపార్శ్వం అభిమానంతో నిండి వుంటుంది. ఆ పార్శ్వాన్ని సక్రమంగా వినియోగించుకోగలిగినవారు అసలైన జీవితమాధుర్యాన్ని చవిచూడగలరు. ప్రకృతిలోనూ, మానవప్రకృతిలోనూ ఎన్నోసందర్భాల్లో, ఎన్నో రకాలుగా అభిమానం తొణికిసలాడుతుంటుంది. ఆమని నందనోద్యానాన్ని ఆత్మీయంగా స్పర్శించి అక్కడ తన అభిమానాన్ని చిగురులుగా తొడుగుతుంది. తొలకరి మేఘం ఆలపించే వర్షరాగాన్ని ఆలకిస్తూ మయూరి పురివిప్పిన అభిమానంతో నాట్యం చేస్తుంది. నిండుపున్నమి వెన్నెల కిరణం సోకగానే చకోరం అభిమానం గొంతు సవరించుకుంటుంది. మనిషి మనిషికీ మధ్య హృదయభాష అవుతుంది అభిమానం. ఒక హృదయ వెన్నెల కిరణ స్పర్శకు మరో హృదయకడలిలో నుంచి అలలా వుప్పొంగుతుంది అభిమానం. అది హృదయకుసుమం వెదజల్లే సుగంధం. అది సమైక్యతాబండిని నడిపించే ఇంధనం. 'గోదావరీ నా ప్రేమనెట్లా చెప్పను! నిన్ను కౌగలించనైనాలేను' అంటూ అఖండ గోదావరి నదిమీద కవివరేణ్యుడు వజీర్ రెహ్మాన్ తన అపారమైన అభిమానాన్ని ప్రకటించుకున్నాడు. అభిమానం జీవితపు కోనలో సెలయేరంత తేటగా ప్రవహిస్తూవుంటుంది. పసిపాప బోసినవ్వంత స్వచ్ఛంగా వెలిగిపోతుంటుంది. మన మధ్య అక్షరాల రెక్కలు కట్టుకొని లేఖలుగా వాలుపోతుంటుంది. గూగులమ్మ సందేశాలైపోతుంటుంది. అభిమానం అనే ఇరుసుతోనే ప్రపంచం నడుస్తూవుంటుంది.

'యాస్మీన్ నీ కంఠం/ తెల్లారిలేస్తూనే
పిట్టలా పైకెగిరి/ ఉదయవృక్షానికి
చిటారు కొమ్మని/ రెక్కలల్లాడిస్తో/ఉయ్యాలలూగుతుంటుంది
అప్పటికి నా కళ్ళు/ రెక్కలు రాని పక్షులా
తలగడ మైదానంలో/ టపటపాకొట్టుకుంటాయి
యాస్మీన్ నీ కంఠం/ బరువుగా/ బంగారుగా/ పారే/
మధ్యాహ్నపు సెలయేట్లో/ఎక్కడో
అడుగున/ సన్నగా గొంతెత్తే/గులకరాయి
యాస్మీన్ నీ కంఠం/ రెక్కలు ముడుచుకున్న
వయొలిన్ లా/ రాత్రులు/ గూటికి చేరుకొని
తారస్థాయిలో/ కొత్తస్వరాలని/ నిద్దట్లో పొదుగుతుంటుంది
('యాస్మీన్ నీ కంఠం' ఖండిక నుంచి)

అంటూ తన అభిమాన గాయకుడు యాస్మీన్ పట్ల తన అఖండ అభిమానాన్ని ప్రకృతి ప్రతీకలతో ప్రకటించుకుంటాడు అనుభూతి కవి ఇస్మాయిల్. కవి అభిమానపు వెల్లువలో గాయకుడి స్వరం ఉదయరాగాన్ని ఆలపిస్తూ చిటారుకొమ్మన వూయలలూగే పిట్ట

అయిపోతుంది. అనందాల అనుభూతుల్ని అందించడానికి గలగలపారే మధ్యాహ్నపు సెలయేటి అడుగున సన్నగా సవ్వడి చేసే గులకరాయి అయిపోతుంది. రాత్రుళ్లు గూటికి చేరుకొని కొత్త పిట్టల్ని పొదిగే తల్లిపిట్టలా కొత్త స్వరాలను వినిపించే వయొలిన్ వంటి అఖండ సుమధుర గానాన్ని ఆలపించడానికి సిద్ధమవుతాడు కవి. తలగడమైదానంలో నిద్రావస్థలో వున్న తన కళ్లు రెక్కలు విప్పుకొని టపటపా కొట్టుకుంటూ తనివితీరా సంగీతాన్ని ఆస్వాదించాలని కవి ఆకాంక్షిస్తున్నాడు. ఇక్కడ కవి ప్రకృతి ప్రతీకలతో తన అభిమానానికి కారణమయ్యే, తన హృదయ స్పందనలో భాగమైపోయిన ఆ సుమధుర రాగానికి, పురివిప్పి నాట్యం చేసిన తన అభిమానానికి గౌరవాన్ని ఆపాదించడం ఇక్కడి ప్రత్యేకత. తన బతుకును సేదదీర్చే యాస్మీన్ కంఠాన్ని అతని కవిత్వం అభిమానపు వెల్లువై అభిషేకిస్తుంది. గాయకుడి స్వరాలకు కైమోడ్పులు సమర్పిస్తుంది. ఎక్కడో సెలయేటి అడుగున సన్నగా వినిపించే గులకరాయి సవ్వడి లాంటి ఆ స్వరాన్ని సైతం ఆ అభిమానం అందుకుంటుంది.

'ఇదివరకెన్నడూ చూడకున్నా సరే
చూపుల్లోని స్నేహం కురవగానే
కళ్లూ కళ్లు మాట్లాడుకుంటాయి
పూర్వపరిచయం లేకున్నా పర్వాలేదు
మోముపై విరబూస్తున్న ఆత్మీయత
ముఖమూ ముఖమూ ముచ్చటిస్తాయి
అప్పుడప్పుడూ కనిపిస్తున్న రూపం
పెదిమల్లోంచి రాలే చిరునవ్వుల మొగ్గలు
అసంకల్పితంగానే పుష్పించిన స్నేహం
దూరంగా లీలగా కనిపించగానే
అప్రయత్నంగా పరస్పర నమస్కారాలు
క్రమక్రమంగా కలిసిన కరచాలనలు
పేరు తెలవదు/ ఊరు తెలవదు
చూపుల్లో సోపతి కుదిరింది
మనిషితో మనిషితీగ అల్లుకుపోయింది
('అల్లిక' ఖండిక నుంచి)

అంటూ మనిషి మనిషికీ మధ్య జరిగే అభిమానపు అల్లికను కవిత్వీకరిస్తాడు వర్తమాన కవి అన్నవరం దేవేందర్. మనుషుల మధ్య ప్రసరించే చూపులువేసే వారథిలో అభిమానం ప్రవహించడం ఇక్కడ కవిత్వమైపోయింది. పరిచయాలతో పనిలేకున్నా విరబూసే ఆత్మీయతాసుగంధాలతో ఆమనియై ముఖాలముచ్చట్లకు దారి తీస్తుంది అభిమానం. అప్పుడు రూపంతో పనిలేకుండా స్నేహాల పుష్పాలు పరిమళిస్తాయి. ఇరువురి హృదయభాషలు ఆర్ద్రమై హత్తుకున్నప్పుడు ఇరువురి రూపాలకు కైమోడ్పులతో, కరచాలనాలతో గౌరవాన్ని ఆపాదిస్తుంది అభిమానం. చూపులతో కుదిరిన అనుబంధాన్ని పదికాలాలపాటు పదిలం చేస్తూ మనుషుల్ని పరస్పరం అల్లుకొనే తీగల్ని చేస్తుంది. మనుషుల్ని ఒకటి చేసే హృదయస్పందనలకు భాష్యం చెబుతుంది. వసుధైక వికాసనానికి అది నందనోద్యానమైపోతుంది. అభిమానానికి ఏదీ సాటిరాదు. ఎన్నెన్నో జీవితాల నదుల్ని కడలిలా సంఘటితపరుస్తూ వుంటుంది అభిమానం. అది జీవితాల క్షేత్రాలను ఎప్పుడూ సారవంతం చేసే ప్రవాహం. అందుకే ప్రతిఒక్కరూ అవుతుంటారు దానికి దాసోహం. అది ఎప్పుడూ తీరని దాహం.

-డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, సెల్: 9177732414

సాహితి

పదనిస

డా ఎన్. గోపి

పదం పాతదే కావచ్చు
కాని అతడు పలికితే కొత్తగా వుంటుంది.
ఆ ధ్వని సముదాయమూ అంతే
ఆవేశం అంటుకొని
నిగనిగ లాడుతుంది.
ప్రతి పదానికీ ఒక అర్థముంది
అనుభూతితో అది భావమౌతుంది
పదం వాక్యంలో ఇమిడిపోయి
కావ్యానికి పునాది వేస్తుంది.

పదాలు విడివిడిగా
నిఘంటువుల్లో నిద్రపోతుంటాయి
వాటిని మేల్కొలిపి
దుమ్ము దులిపి ఎగరేసే
మొనగాడు కవి.

పదంగా మారక ముందు
అదొక అమూర్త భావన
ధ్వనిగా వెలువడక ముందు
అదొక అపూర్వ వీణ.

డబ్బులు కాదు
జేబులో ఎప్పుడూ కొన్ని పదాలుంటాయి
అవి అశాంతిగా కదిలినప్పుడల్లా
ప్రశాంతి కరువౌతుంది.

విడిగా వున్నప్పుడు
అది పదమే
ప్రవహిస్తూ ఇతర పదాలను
కలుపుకు పోయేటప్పుడు మాత్రం
అదొక జీవనది.

నిత్యం అతని గళ మొక
పదాతి దళం.
దీనుల కన్నీటిలో తడిసినప్పుడు
అదొక యుద్ధభేరి.

పదానికి రాగం తోడైతే
అది పాట
పదానికి పాదం తోడైతే
అది ఆట.
విశ్వాన్ని కల గన్నప్పుడల్లా
ఎడతెగని బాట
మానవ సంవేదనే
జీవితంలో పేరిన తేట.

రసాత్మక కన్నీరు



నీరంతా ఒక్కటి కాదు
అంతవరకు రంగు రుచులతో
అస్థిత్వమై మూడునదులు
త్రివేణి సంగమ రసాయన చర్యలో
ఒకేరుచి ఒకే రంగువస్త్రంతో
గంగ ప్రయాణం!
కాషాయమై గోదావరి
జాతీయజెండాను గుర్తుచేస్తే
శరత్ కాల నీలాకాశంలా
కృష్ణమ్మ రంగుమారింది
నీటికి రంగువుంది రుచివుంది!
కన్నీరంతా ఒక్కటికాదు
పుట్లధాన్యం బండికెక్కించి
ముక్కుతాడు చర్నాకోలు బట్టి
రైతు ఎద్దుల్ని పదపదమంటే
పంట దిగుబడిలో భాగమైన ఎద్దులు
అడుగులు వేస్తూ
గాలికుంటు అర్రువుందు
అశనిపాతమై
మూగగా మోరెత్తి కన్నీరు కార్చాయి
కన్నీరు భయానక రసం!
కాలు దువ్వి దుమ్ములేపి
రెండు పొట్టేళ్ళు బొబ్బిలి యుద్ధమై
ఫాలభాగాలు పగులుతున్న చప్పుడు
పరుగెత్తిన కాపరి రాజీలోగా
ఓడిన పొట్టేలు ఆయువు
కన్నీరుకార్చి గాల్లో కలిసింది
కన్నీరు వీరరసం!
కులవివక్షలో చిక్కి
ప్రేమించిన హృదయాలు
రక్త సంబంధ దాష్టీకానికి బలై కార్చిన
కన్నీరు బీభత్స రసం!
ప్రార్థనా స్థలిలో గాంధి
గాడ్సే పిస్తలుకు బలైనపుడు
చెమ్మగిల్లిన గాంధీ కళ్ళ
తడి శాంతరసం!
ఉయ్యాల్లో పసిబిడ్డ గుక్కపట్టిన ఏడ్పు
అంతంలేక సాగితే
భయపడ్డ ఉయ్యాలకంపించింది
అమ్మ కోసమో ఆకలికోసమో
పక్కతడుపో-
ఎడారి చెక్కిళ్ళపై పారిన కన్నీరు
నోటి ఒయాసిస్సుకు జారితే
నవరసాల్లో ఏరసమూకాని కన్నీరు
వడకట్టిన మంచినీటి మూట!
మాటలు రాని పసిబిడ్డకు
ఏడుపే మాట, ఏడుపే పిలుపు!

అడిగోపుల వెంకటరత్నమ్,
సెల్ : 9848252946

స్ఫూర్తిదాయక కవిత్వం '1818'

భీమేకోరేగావ్ యుద్ధం నేపథ్యంలో సాగే 1818 దీర్ఘ కవితను 'పుప్పాల శ్రీరామ్' రాసారు. ఆ యుద్ధం జరిగి రెండు వందల యేళ్లు గడిచిన సందర్భంగా 2018లో భారీయెత్తున అక్కడ దళిత ఐక్యతా సమావేశం జరిగింది. దానిపై మనువాదులు కుట్ర పన్ని రసాభాస చేశారు. అయితే ఈ 1818 కవిత దళితఅస్తిత్వం, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమ్మిళితంగా సాగుతుంది. నదులు నాగరికత సూచీలు. కవి భీమానది చుట్టూ ఈ దీర్ఘ కవితను అల్లడమనేది సింబాలిక్‌గా చాలా ఆవశ్యకమైనది. అంటే దీనిద్వారా కవి ఒక కౌంటర్/ఆల్టర్నేటివ్ హిస్టరీని మన ముందు ఉంచుతున్నట్లుగా ఉంది. ఈ ప్రక్రియ ఒక రాజకీయ, సాంస్కృతిక అస్తిత్వానికి సంబంధించి ఒక సృజనాత్మక ఎత్తుగడ. సమాజంలో ఒక 'మెజేరిటియన్ వ్యూ' బలంగా పోతున్నప్పుడు దానికి ఆధిపత్యం కూడా తోడవుతున్నప్పుడు, వాటిని తిప్పికొడుతూ వచ్చే 'కౌంటర్ కల్చరల్ మూవ్‌మెంట్' చాలా ముఖ్యమైనది. ఈ మూవ్‌మెంట్ చరిత్రలో జరిగిన విషయాలను తీసుకుని ఒక రాజకీయ, సాంస్కృతికమైన నేరేటివ్‌తో మెజారిటేరియన్ వ్యూని ఎప్పుడూ ప్రశ్నిస్తూ ఉంటాయి. భీమేకోరేగావ్ సంఘటన దాని చరిత్ర, దాని సమకాలీన ప్రాసంగికత అన్నీ కూడా దీనిలో భాగంగానే చూడాలి. ఈ కోణాన్ని ఆవిష్కరించడంలో ఈ దీర్ఘ కవిత చాలా మేరకు విజయం సాధించిందనే చెప్పాలి.

1818 భీమే కోరేగావ్ యుద్ధం, 1857 సిపాయిల తిరుగుబాటు రెండు విభిన్న లక్ష్యాలతో జరిగినప్పటికీ వీటి పోలిక కొంతమేర అవసరం. సిపాయిలు తిరుగుబాటు చర్య ఆంగ్లేయులపై జరిపినది కాబట్టి ఒక దేశభక్తి చర్యగానూ, భీమే కోరేగావ్ యుద్ధం ఒక దేశ వ్యతిరేక చర్యగానూ చెప్పబడుతుంది. ఈ 1818 దీర్ఘ కవితలో చెప్పినట్లు దళితులు (మహర్లు) ఈ దేశ నిర్మాణంలో భాగం. శ్రామికులుగా, వ్యవసాయ కూలీలుగా, వలస కార్మికులుగా మన సమాజ నిర్మాణంలో వారి పాత్రను విస్మరించి భీమే కోరేగావ్ లాంటి సంఘటనలతో వారి దేశభక్తిని శంకించడం వెనుక ఉన్న ఆంతర్యాన్ని అర్థం చేసుకోవాలి. అప్పటికే దేశంగాలేని సమయంలో జరిగిన సంఘటనని దేశభక్తి కోణంలో చూడడంతో వారు చారిత్రకంగా సాధించుకున్న విజయాలను కించపరచడమే కాకుండా, సమకాలీన అస్తిత్వ పోరాటాలను, రాజకీయ ఎదుగుదలను ఏ కుట్ర కేసుగానో, రాజ ద్రోహంగానో చూడడం అనేది రాజ్యం యొక్క ఆధిపత్య, అహంకార భావజాలానికి నిదర్శనం. చారిత్రకంగా బ్రాహ్మణీయ భావజాలాన్ని ప్రశ్నించడంలో మరాఠీల, మహర్ల యొక్క పాత్ర చాలా కీలకమైనది. అనాదిగా వీరిరువురూ కలిసి బ్రాహ్మణ ఆధిపత్యాన్ని నిరసిస్తూ వచ్చారు. ఇప్పుడు సమకాలీన రాజకీయాలలో మరాఠీలను, మహర్లను వేరు చేసే పనిలో భాగంగానే మొన్న జరిగిన దాడులు కనిపిస్తున్నాయి.

ఈ కవితను ఇంకా పరిశీలించినట్లయితే, మూడు విషయాలు కనిపిస్తాయి. ఒకటి రాజ్యం చేసే హింస మరియు అణచివేత, రెండు దళితులపై దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆధిపత్య కులాల దాడులు, మూడు జాతి నిర్మాణంలో దళితుల యొక్క శ్రామిక పాత్ర-ఆధిపత్య కులాలపై వారి తిరుగుబాటు. ఈ మూడింటిని సమాజం అర్థం చేసుకోవాలనే తపన కవిలో కనబడుతోంది.



ఇంకా మనం నిర్మించుకున్న వ్యవస్థలతోనే ప్రజాస్వామ్యం మీద, ప్రాథమిక హక్కుల మీద జరిగే దాడిని కవి ప్రశ్నిస్తాడు. ఎంత అణిచినా, ప్రశ్న మళ్ళీ మళ్ళీ పుట్టుకొస్తుందని హెచ్చరింపు కూడా చేస్తాడు. 'ప్రశ్నల్ని ఒప్పుకోవట్లేదు/ చీపురు పుల్లలతో పిల్లల్ని బాణాలాట ఆడుకోనివ్వట్లేదు/ వానపాముల పొట్లో మట్టిరేణువుల్ని కూడా/ పెళ్లగిస్తున్నారు/ దమ్ములో మొలకల్నీ/పదునైన వాటి మొనల్ని/ కోడిపుంజు పూలనీ, ఎగరేసే వాటి తలల్ని/జైళ్ళలోకి నెట్టేస్తున్నారు' ఇలా రాజ్యం వ్యవహారశైలిని కవి తీవ్రంగా తప్పుబడతాడు.

'విచారణ ఖైదీలెవ్వరికీ విచారమే లేదు/చేసిన నేరాలు తెలియనక్కరలేదు/అండర్ ట్రయిల్ గాళ్ళకి/భారత శిక్షా స్మృతిలో మిల్లీమీటర్ చోటుండదు/పుస్తెలు కట్టీకట్టగానే అరెస్టైన నూనూగు మీసాలవాణ్ణి/పున్నమిరాత్రి విడిచి పెట్టాలి/వకీళ్లను అనుమతించాలి/ములాఖత్ అర్జీలపై మనసుతో దస్తఖత్ చేయాలి/అసలు నా ఇంటిపేరేమిటి/సందు మొగసాల నుంచి మాదెన్నో ఇల్లు/నా ఆధార్ కార్డులో నెంబర్లు ఎక్కడికి వెళ్లాయి/నా కిలోబియ్యం ఎవరింట్లో ఉడుకుతుంది/నా చూపుడువేలిపై ఇంకుమరకని ఎవరు తుడిచేసారు' విచారణ పేరిట అరెస్టయ్యే ఖైదీల హక్కులు కాలరాయబడ్డాన్ని కవి ప్రశ్నిస్తాడు. అంటే ఈ దేశంలో విచారణ ఖైదీలకు ఎటువంటి ప్రాథమిక హక్కులు లేవా? కనీసం ఓటు వేసే హక్కు కూడా లేదా? అంటూ రాజ్యం పోకడలను దుమ్మెత్తిపోస్తున్నాడు.

దీర్ఘ కవితలో కవి పలు దేశీయ సంఘటనలను కూర్పుచేసాడు. ఆయా అంశాల పట్ల పాలకులు వ్యవహరించిన తీరుతో కవి విభేదిస్తాడు. సంచలనమైన హత్రాస్, ఉన్నావ్, కథువా, నిర్భయ మొదలగు దళిత, మైనారిటీ ఆడబిడ్డలపై జరిగిన అమానవీయ సంఘటనలను కవితలో చొప్పించకపోవడం వెలితే. 'మై డియర్ ఇండియా/నీకు తెలియడం లేదు గానీ/నువ్వెంత భయదరూపానివో, వొంగి చూసుకుందుకు/ఒక ఖాళీ అద్దం పలకను తీసుకొస్తాను' ఇలా చివరి కవితలో ఇండియాను ఆక్షేపిస్తారు. 'నేను భీమానదిని ఆఖరిసారి హెచ్చరిస్తున్నాను/ఇండియా సాయిబాబాని విడిచిపెట్టు/నా ప్రియాతి ప్రియమైన కవి వరవరరావు కూడా' మొత్తంగా చివరికి కవి బహిర్గతం అవుతాడు. కవిత్వ లక్షణాలు దృష్టిలో చూసుకుంటే, అలా అవ్వొచ్చా? లేకపోతే ఈ కవిత నేపథ్యం దృష్ట్యా అలా బహిర్గతం అవ్వడమే మంచిదా? దీర్ఘకవిత లక్షణానికి భిన్నంగా కవి వస్తువును దాటి ప్రయాణించారు. దీన్ని కవి కొత్త ప్రయోగమనవచ్చు. అయితే ఏ కవితా వస్తువునైనా కవిత్వ లక్షణాలతో బంధించొచ్చా? లాంటి విషయాలను మనం చర్చించుకోవాలి. కవితను బొమ్మ కట్టించడంలో కొంతమేర తడబాటు ఉంది. దీనికి కారణం గాఢమైన పదాల ప్రయోగం మరియు వస్తువు పరిధి పెంచుకోవడం కావచ్చు. మొత్తంగా చూస్తే శ్రీరామ్ కవిత్వంలో జవసత్వముంది. ఉద్వేగం ఉంది. అది చిరుత పరుగులా ఉంటుంది. పులి పంజా విసిరినట్లుంటుంది. సింహం జూలు విదిల్చినట్లుంది. డేగ చూపులా తీక్షణంగా ఉంటుంది. నలుచెరగులా ప్రతిధ్వనించే సాంద్రమైన కవిత్వమిది. నలుగురి నోట పలకగలిగే సామాజిక, రాజకీయ కవిత్వమిది.

పిల్లా తిరుపతిరావు, 7095184846

రాజాం రచయితల వేదికపై రంగనాథం ప్రసంగం

రాజాం రచయితల వేదిక 103వ సమావేశం ఈ నెల 27 ఆదివారం ఉదయం 9.30 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో సమతం మహేశ్వరరావు అధ్యక్షతన జరుగుతుంది. ఆ సభలో 'వావిలవలస జమీందారీ నాడు-నేడు' అనే అంశంపై వేదిక నిర్వాహకుడు గార రంగనాథం ముఖ్యప్రసంగం చేస్తారు.

రాజాం రచయితల వేదిక, సెల్: 9885758123



భారతమాత ఎవరు?

మంచి పుస్తకం

భారత్, భారతమాత అన్న మాటలకు అర్థం ఒకటే అనిపించవచ్చు. కానీ అర్థ భేదం ఉంది. మన రాజ్యాంగంలో భారత్ అన్న మాట కనిపిస్తుంది కానీ ఆ మాటకు లింగ భేదం లేదు. వాడుకలో మాత్రం భారత్ అన్న మాటకన్నా, భారతమాత అన్న మాటే ఎక్కువగా వినిపిస్తుంది. మాత అనేసరికి ఈ దేశానికి స్త్రీ లింగం ఆపాదించినట్టే.

దేశం అన్న మాట నిజానికి నపుంసక లింగమే. దేశాలను పురుష రూపంలోనూ, స్త్రీ రూపంలోనూ భావించే సంప్రదాయం ఉంది. జర్మనీని పురుష రూపంలో చూస్తారు. యూదులకూ అంతే. వారు పితృభూమి అనే అంటారు. భారత్, బ్రిటన్, రష్యా లాంటివి తమ దేశాన్ని స్త్రీలింగమనే భావిస్తాయి.

అవనీంద్రనాథ్ ఠాగోర్, ఎం.ఎఫ్.హుసేన్, డి.బెనర్జీ-ఈ ముగ్గురు కళాకారులూ భారతమాత చిత్రాలు గీశారు. ఎవరి ఊహకు తోచినట్టు వారు చిత్రించారు. భారత వారసత్వాన్ని చూపించే ప్రయత్నమే అవనీంద్రనాథ్ ఠాగోర్ చిత్రించిన భారతమాత. ఇది బ్రిటిష్‌వారు అనుసరించిన విభజించి పాలించే విధానంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు ఉంటుంది. ఆయన జపాన్ చిత్రకారుడు ఒకకురా కకుజో స్ఫూర్తితో ఈ చిత్రం గీశారు.

భారతమాతను దేవతగా భావించే సంప్రదాయం ఉంది. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ఉపయోగించే భారతమాత చిత్రంలో కాషాయ జెండా ఉంటుంది తప్ప త్రివర్ణ పతాకం ఉండదు. అది బ్రిటిష్‌వారి విభజించి పాలించే విధానానికి నిరసన తెలియజేస్తున్న దేవతా రూపంలా కనిపిస్తుంది.

డి. బెనర్జీ గీసిన భారతమాత హిందూ దేవతా రూపమే. ఆమె చతుర్భుజి. భారతమాత రెండు చేతులకు సంకెళ్లు ఉంటాయి. ఒక చేతిలో వరి కంకులు, మరో చేతిలో పతాకం ఉంటుంది. భారతమాత చిత్రం పై భాగంలో లాలా లజపత్ రాయ్, లోకమాన్య బాల గంగాధర తిలక్, మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్ దాస్ ఫొటోలు కనిపిస్తాయి.

ఎంఎఫ్ హుసేన్ గీసిన భారతమాత్ర చిత్రంలో ఆమె ధరించిన చీరతో సహా ఎక్కువ భాగం ఎరుపు రంగులో ఉంటుంది. ఈ చిత్రం నగ్నంగా ఉంటుంది. బందీగా ఉన్నట్టు ఉంటుంది. బంకించంద్ర చటర్జీ "ఆనంద్ మఠ్" నవలలో భారత్‌ను మాతృభూమిగానే, దేవతగానే భావించారు. బంకించంద్ర, రవీంద్రనాథ్ ఠాగోర్ ఊహించిన మాతృభూమి జాతీయోద్యమ స్ఫూర్తితో రూపొందింది. అది హిందుత్వవాదులు చెప్పే జాతీయతావాదం కాదు. దానికి ఆర్‌ఎస్‌ఎస్ హిందూ దేవత రంగు పులిమింది.

'హూ ఇస్ భారత్‌మాత?' అన్న గ్రంథాన్ని ఈ నేపథ్యంలోంచి చూడాలి. ఈ పుస్తకాన్ని పురుషోత్తం అగర్వాల్ వెలువరించారు. సంపాదకుడూ ఆయనే. ఇందులో ప్రధానంగా నెహ్రూ భారత్‌ను లేదా భారతమాతను ఏ దృష్టితో చూశారో తెలియజేశారు. అందులో నెహ్రూ తన ఆత్మకథ, డిస్కవరీ ఆఫ్ ఇండియా, గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీలో రాసిన కొన్ని భాగాలు ఉన్నాయి. నెహ్రూ వ్యాసాలు, ఉపన్యాసాలలోని కొన్ని భాగాలూ ఉన్నాయి. వాటితో పాటు నెహ్రూ మీద మహాత్మా గాంధీ, భగత్ సింగ్, షేక్ అబ్దుల్లా, రాంధారీ సింగ్ దినకర్, అలీ సర్దార్ జాఫ్రీ, మార్టిన్ లూథర్ కింగ్ (జూనియర్), అటల్ బిహారీ వాజపేయి లాంటి వారి వ్యాసాలూ ఉన్నాయి. నెహ్రూ దృష్టిలో భారత్ అంటే భూభాగం కాదు. ఆ భూభాగ పరిధిలో ఉండే ప్రజలే ఆయన దృష్టిలో భారత్. ఆ ప్రజల జయాపజయాలే భారత్. ఈ మాట ఆయన 1936లో చెప్పారు. దేశం అంటే మట్టి కాదు మనుషులు అని 20వ శతాబ్దం ఆరంభంలోనే చెప్పారు.

మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత నెహ్రూ అస్తిత్వాన్నే మటు మాయం చేయాలన్న ప్రయత్నం జోరుగా సాగుతోంది. దేశం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ నెహ్రూనే దోషిగా నిలబెడుతున్నారు. అందుకని నవతరం నెహ్రూ గురించి స్థూలంగా తెలుసుకోవడానికి ఈ గ్రంథం చదవాలి.

ఈ గ్రంథం నెహ్రూ ఆలోచనా ధోరణిని, తాత్వికతను, అనుభవాలను వివరిస్తుంది. ఆయన అపారంగా చదివినందువల్లే ఆ విశిష్టమైన వ్యక్తిత్వం రూపొందింది. జాతీయతావాదం, 'భారత్ మాతాకీ జై' అన్న నినాదాలు మిన్నంటుతున్న తరుణంలో నెహ్రూ అంటే ఏమిటో తెలుసుకోవడానికి ఈ గ్రంథం బాగా ఉపకరిస్తుంది. భారత్ అంటే కేవలం ఉద్వేగాలకు పరిమితమైన విషయం కాదు అని బోధ పడుతుంది.

పురుషోత్తం అగర్వాల్ కూర్చిన ఈ గ్రంథానికి ఆయనే సుదీర్ఘమైన ఉపద్ఘాతం రాశారు. భారత సంస్కృతి, స్ఫూర్తి, శాస్త్రీయ స్పృహ, నాయకత్వ లక్షణాలు రూపొందిన క్రమాన్ని ఈ ఉపోద్ఘాతం తోడ్పడుతుంది. ఎన్ని రాజకీయ ఒత్తిడులు ఉన్నప్పటికీ ఆయన జీవితాంతం ఉత్తమ ప్రజాస్వామ్యవాదిగా, లౌకికవాదిగా నిలిచిన వైనమూ కనిపిస్తుంది.

- ఆర్వీ రామారావ్

మాకు 'నీట్' మినహాయించాల్సిందే

- అప్పటి వరకు పోరాటం ఆగదు
- తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ స్పష్టీకరణ
- నిరాహార దీక్ష చేపట్టిన పార్టీ శ్రేణులు

చెన్నై: రాష్ట్రానికి జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)ను మినహాయించేలా అన్ని ప్రయత్నాలు చేస్తామని డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదివారం హామీ ఇచ్చారు. కాగా, పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరాహారదీక్షకు ఆయన కుమారుడు, మంత్రి ఉదయనిధి నాయకత్వం వహించారు. జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నుంచి తమిళనాడుకు మినహాయింపు లభించే వరకు డీఎంకే పోరాటం చేస్తుందని స్టాలిన్ స్పష్టం చేశారు. అయితే నీట్‌ను డీఎంకే 'రాజకీయం' చేస్తోందని ప్రతిపక్ష బీజేపీ ఎదురుదాడికి దిగింది. వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆయన పార్టీ చేస్తున్న ఆందోళనతో ఒక వివాహ వేడుకలో సీఎం స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు ఏకీభవించాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నీట్ వ్యతిరేక బిల్లుకు అనుకూలంగా తాను ఎప్పటికీ సంతకం చేయనని ఇటీవల ప్రకటించిన తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవిపై కూడా స్టాలిన్ విరుచుకుపడ్డారు. ఈ అంశం రాష్ట్రపతి వద్ద ఉందని, రాష్ట్ర అసెంబ్లీ చేపట్టే విషయాలను రాష్ట్రపతి భవన్‌కు పంపాల్సిన 'పోస్ట్‌మాన్' మాత్రమే గవర్నర్ పని అని సీఎం అన్నారు. ఆదివారం అన్నాడీఎంకే భారీ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్న మధురైలో మినహా రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీ నిరాహార దీక్షలు జరిగాయి. ఈ టెంపుల్ సిటీలో ఆగస్టు 23న నీట్ వ్యతిరేక నిరాహార దీక్షలు జరగనున్నాయి. ఇక్కడి వల్లువర్ కొట్టంలోని నిరసన వేదిక వద్ద డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు ఉదయనిధితో పాటు సీనియర్ నేతలు, కేబినెట్ మంత్రులు దురైమురుగన్, మా సుబ్రమణియన్, పి.కె.శేఖర్ బాబు, పార్టీ ఎంపీలు దయానిధి మారన్, ఎమ్మెల్యేలు, చెన్నై మేయర్ ప్రియా ఆర్ పాల్గొన్నారు. వేదికపై అరియలూర్‌కు చెందిన ఎస్.అనిత సహా నీట్‌పై ఆత్మహత్యకు పాల్పడిన వైద్య ఆశావాదుల చిత్రపటాన్ని ప్రదర్శించి, వారికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎంకే యువజన విభాగం, విద్యార్థి విభాగం, వైద్యుల విభాగం నర్వర్యంలో ఆదివారం సమ్మె జరిగింది. కొత్తగా పెళ్లయిన జంటలు కూడా నీట్ వ్యతిరేక బ్యానర్లు పట్టుకుని నిరసనకు దిగారు. గతవారం మరో ఆశావహురాలు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో నిరాహార దీక్ష నిర్వహిస్తున్నారు. వివాహ వేడుకలో స్టాలిన్ ప్రసంగిస్తూ, నీట్‌ను ప్రవేశపెట్టినప్పటి నుంచి తమ పార్టీ దానిని వ్యతిరేకిస్తోందని పునరుద్ఘాటించారు. 2016లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా దేశవ్యాప్తంగా నీట్‌ను అమలు చేశారు. ఇంతకుముందు అన్నాడీఎంకే హయాంలో అసెంబ్లీ ఆమోదించిన బిల్లు వెనక్కి పంపించారు. అసెంబ్లీ జరుగుతున్నప్పుడు కూడా అప్పటి అధికార పార్టీ దానిని వెల్లడించలేదని ఆయన అన్నారు. ఆ బిల్లు తర్వాత మురిగిపోయిందని, 2021 ఎన్నికలకు ముందు తమ పార్టీ నీట్ నిషేధం కోసం హృదయపూర్వకంగా కృషి చేస్తామని హామీ ఇచ్చిందని స్టాలిన్ చెప్పారు. డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత తమిళనాడుకు మినహాయింపు కోరే ఈ బిల్లును రెండుసార్లు ఆమోదించింది. 'చివరికి చాలా పోరాటం తర్వాత రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. ప్రభుత్వం గట్టిగా ఒత్తిడి చేసిన తర్వాతే రవి బిల్లును రాజ్‌భవన్‌లో ఉంచి రాష్ట్రపతికి పంపారని ఆరోపించారు. రాష్ట్రానికి సంబంధించిన నీట్ వ్యతిరేక బిల్లుకు తాను ఎప్పటికీ సమ్మతి ఇవ్వబోనని గవర్నర్ రవి ఇటీవల ఒక సందర్భంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, 'కేంద్రం సలహా మేరకే బిల్లుపై రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలి. రాష్ట్రపతికి మాత్రమే అధికారం ఉంటుంది. గవర్నర్‌కు కాదు... ఆయనకు పోస్ట్‌మ్యాన్ పని మాత్రమే ఉంటుంది.. మనం పంపిన వాటిని ఆయన పంపాలి' అని అన్నారు. ఈ పోరాటం కొనసాగుతుందని, నీట్ మినహాయింపు వచ్చే వరకు డీఎంకే ఆగదని, అధికారంలో ఉన్నా లేకపోయినా ఈ ఉద్యమం ప్రజల కోసం పని చేస్తుందని సీఎం తెలిపారు. ఇక్కడి నిరసన వేదిక వద్ద రాష్ట్ర మంత్రి దురైమురుగన్ మాట్లాడుతూ నీట్ విద్యార్థుల సంక్షేమానికి విరుద్ధమని, డీఎంకే చాలా కాలంగా దీనిని వ్యతిరేకిస్తోందన్నారు. రాష్ట్ర అసెంబ్లీ గత ఏఐఏడీఎంకే హయాంలోనూ, ప్రస్తుత డీఎంకే పాలనలోనూ నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు చేసింది. ప్రస్తుతం, నీట్ వ్యతిరేక బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం ఉంది. దురైమురుగన్ మాట్లాడుతూ ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ, నీట్‌కు వ్యతిరేకంగా తమిళనాడు చేసిన అభ్యర్థనను కేంద్రం పట్టించుకోలేదని ఆరోపించారు, కాగా, నీట్‌ను అధికార డీఎంకే రాజకీయం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై ఆరోపించారు. నీట్ సమస్య కాదు కానీ డీఎంకే దానిని భావోద్వేగ అంశంగా మార్చి విద్యార్థుల ఆత్మహత్యలకు దారితీసేలా చేసిందని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి మరణాలు జరగలేదన్నారు. వాళ్లు (డీఎంకే) రాజకీయాలు చేస్తున్నారని అన్నామలై విలేకరులతో అన్నారు.

అఖిలేశ్‌తో రజనీకాంత్ భేటీ

లక్నో: ప్రముఖ నటుడు రజనీకాంత్ ఆదివారం ఆదివారం ఇక్కడ సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. అనంతం మీడియాతో మాట్లాడుతూ... 'తొమ్మిదేళ్ల క్రితం, నేను ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో అఖిలేశ్‌ని కలిశాను. అప్పటి నుంచి మా స్నేహం కొనసాగుతోంది... మేము ఫోన్‌లో మాట్లాడుకుంటాము. నేను ఐదేళ్ల క్రితం షూటింగ్ కోసం ఇక్కడకు వచ్చాను కానీ... అఖిలేశ్ అక్కడ లేకపోవడంతో కలవలేకపోయాను. అతను ఇప్పుడు ఇక్కడ ఉన్నాడు. నేను అతనిని కలిశాను' అని 72 ఏళ్ల సినీ సూపర్‌స్టార్ పేర్కొన్నారు. రజనీకాంత్ భేటీకి సంబంధించిన ఫోటోలను అఖిలేశ్ యాదవ్ కూడా 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. 'హృదయాలు కలిసినప్పుడు, ప్రజలు ఆలింగనం చేసుకుంటారు. మైసూర్‌లో ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు... రజనీకాంత్ జీని తెరపై చూసినప్పుడు నేను అనుభవించిన ఆనందం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. మేము 9 సంవత్సరాల క్రితం వ్యక్తిగతంగా కలుసుకున్నాము... అప్పటి నుండి స్నేహితులుగా ఉన్నాము' అఖిలేశ్ పేర్కొన్నారు. ఆగస్ట్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయవంతంగా ప్రదర్శితమవుతున్న తన చిత్రం "జైలర్" ప్రమోషన్ కోసం రజనీకాంత్ శుక్రవారం లక్నో చేరుకున్నారు. శనివారం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కూడా రజనీకాంత్ కలిశారు.

యూపీలో ముస్లిం దంపతుల దారుణ హత్య

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్‌లో ఘోరం చోటు చేసుకుంది. అబ్బాస్, కమ్రూల్ నిషా అనే ముస్లిం దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. వారి కుమారుడు షౌకత్... రూబీ అనే హిందూ బాలికను తీసుకెళ్లి పెళ్లి చేసుకోవడం ఈ జంట హత్యలకు దారి తీసింది. రూబీ తండ్రి రాంపాల్ మరో నలుగురు వ్యక్తులతో కలిసి షౌకత్ ఇంటిపై దాడి చేశాడు. ఇంట్లో ఉన్న అతని తల్లిదండ్రులను ఇనుప రాడ్‌లు, కర్రలతో దారుణంగా కొట్టి చంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రూబీ తండ్రి రాంపాల్ సహా మరో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. కాగా షౌకత్, రూబీ కుటుంబాలు పక్కపక్కనే నివాసం ఉంటున్నాయి. దాంతో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. రూబీ తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోకపోవడంతో 2020లో ఇద్దరూ కలిసి ఎటో వెళ్లిపోయారు. దీనిపై రూబీ తండ్రి రాంపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటికి రూబీ మైనర్ కావడంతో పోలీసులు షౌకత్ ను అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. ఇటీవలే జైలు నుంచి విడుదలైన షౌకత్... ఇప్పుడు రూబీ మేజర్ కావడంతో మరోసారి తనతో తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. దాంతో ఆగ్రహించిన రూబీ కుటుంబసభ్యులు షౌకత్ తల్లిదండ్రులను దాడి చేసి హతమార్చారు.

కుప్పకూలిన డీఆర్‌డీవో డ్రోన్

బెంగళూరు: రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థకు చెందిన డ్రోన్ ఆదివారం కర్నాటకలో కుప్పకూలింది. చిత్రదుర్గ జిల్లా హిరియూర్ తాలుకా వడ్డికెరె గ్రామ పొలాల్లో డ్రోన్ కూలినట్లు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కూలిన డ్రోన్‌ను చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కొంతకాలంగా డీఆర్‌డీవో యూఏవీల అభివృద్ధిపై పరిశోధనలు చేస్తోంది. తపస్ పేరుతో రూపొందిస్తున్న ఈ డ్రోన్‌ను ఆదివారం ఉదయం డీఆర్‌డీవో పరీక్షిస్తుండగా కూలిపోయినట్లు రక్షణ శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం గురించి రక్షణ శాఖకు సమాచారం అందించినట్లు వెల్లడించారు. డ్రోన్ కూలిపోవడానికిగల కారణాలను విశ్లేషిస్తున్నట్లు తెలిపారు.

రాహుల్‌కు ధన్యవాదాలు: కేంద్రమంత్రి రిజిజు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ బైక్ యాత్రపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. లడాఖ్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్మించిన రహదారులను ప్రమోట్ చేస్తున్నందుకు రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు కిరణ్ రిజిజు ఓ వీడియోను ఎక్స్ (ట్విటర్)లో షేర్ చేశారు. కేంద్ర పాలిత ప్రాంతం లడాఖ్‌లోని లేహ్ పర్యటనలో భాగంగా శనివారం పాంగాంగ్ సరస్సుకు రాహుల్ బైక్ రైడ్ చేపట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. రాహుల్ బైక్ యాత్రపై కేంద్ర మంత్రి స్పందిస్తూ...'మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం లడాఖ్‌లో నిర్మించిన రహదారులను ప్రమోట్ చేస్తున్నందుకు రాహుల్ గాంధీకి ధన్యవాదాలు. కొద్దిరోజుల క్రితం కశ్మీర్‌లోయలో పర్యాటకం ఎలా అభివృద్ధి చెందుతుందో ఆయన చూపించారు. ప్రస్తుతం మన జాతీయ జెండా శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో శాంతియుతంగా రెపరెపలాడుతోంది' అని రిజిజు ట్వీట్‌లో పేర్కొన్నారు.

వారసత్వ రాజకీయాలు విషపూరితం: అమిత్‌షా



భోపాల్: హోంమంత్రి అమిత్ షా వారసత్వ రాజకీయాలను 'విషం'తో పోలుస్తూ... కాంగ్రెస్, ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే), ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) పార్టీలపై విమర్శలు గుప్పించారు. ఈ పార్టీలు వారసత్వ రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. కులతత్వం అనే విషాన్ని వ్యాపింపజేసేందుకు 2015 నుంచి మధ్యప్రదేశ్, మరికొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ కుల ఉద్యమాలను ప్రేరేపించిందని షా ఆరోపించారు. ఇది మధ్యప్రదేశ్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఓటమికి కారణమైందని షా తెలిపారు. మధ్యప్రదేశ్‌లో ఒకరోజు పర్యటన కోసం ఆదివారం ఇక్కడకు వచ్చిన షా... మధ్యప్రదేశ్ ప్రభుత్వ (2003-2023) పనితీరుపై నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. బీజేపీలో వంశపారంపర్య రాజకీయాలపై అడిగిన ప్రశ్నకు షా స్పందిస్తూ... 'నేను ఏ నాయకుడి పేరు చెప్పదలచుకోలేదు కానీ కాంగ్రెస్, డీఎంకె, శివసేన (యూబీటీ)లో వారసత్వ రాజకీయాలం టే... ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు మాత్రమే పార్టీ, ప్రభుత్వంలోకి వస్తారన్నారు. అయితే బీజేపీలోని నేతల కుటుంబ సభ్యులకు టికెట్ల పంపిణీని సమర్థించిన షా... 'ఎక్కడో కొందరికి మెరిట్ ఆధారంగా టిక్కెట్లు ఇచ్చారు. ఇలా చెప్పి వంశపారంపర్య రాజకీయాల సమస్యను పలుచన చేయకండి... ఇది విషం. పార్టీలు ఒక కుటుంబానికి ఆస్తి అయినప్పుడు, క్రింది స్థాయి నుండి వచ్చిన వారి స్థానం ఏమిటి? మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఎలాంటి రాజకీయ కుటుంబ నేపథ్యం లేదు' అని షా చెప్పుకొచ్చారు. తాను బీజేపీక అధ్యక్షుడిని అయ్యానని, మా కుటుంబంలో ఎవరూ రాజకీయాల్లో లేరని షా చెప్పారు. ప్రస్తుత అధ్యక్షుడు నడ్డా కుటుంబానికి కూడా రాజకీయ నేపథ్యం లేదని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి జరగనున్న అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీ అధికారంలోకి వస్తే శివరాజ్ చౌహాన్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారా అని అడిగిన ప్రశ్నకు షా బదులిస్తూ... 'మీరు పార్టీ పని ఎందుకు చేస్తున్నారు? మా పార్టీ తన పని తాను చేసుకుపోతుంది. శివరాజ్ జీ సీఎం... మనం ఎన్నికల ముగింట్లో ఉన్నాం...మోదీ జీ... శివరాజ్ జీ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లండి. కాంగ్రెస్ ఏదైనా అభివృద్ధి చేసి ఉంటే హైలైట్ చేయండి' అని షా పాత్రికేయులకు సూచించారు.

అజిత్ చేసిన తప్పు...శరద్ పవార్ చేయరు: రౌత్

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్... తన మేనల్లుడు అజిత్ పవార్ మాదిరిగా బీజేపీతో చేతులు కలిపే 'తప్పు' చేయరని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ ఆదివారం పేర్కొన్నారు. 'అజిత్ పవార్ సొంతంగా రాజకీయ పార్టీని స్థాపించి ఎన్నికల్లో పోటీ చేస్తే నిజంగా పెద్ద నాయకుడవుతారు. ఏక్‌నాథ్ షిండే చేసినట్టుగానే అజిత్ పవార్... బీజేపీ సహాయంతో చేస్తే ఇసుక కోటలా కూలిపోతుంది. రాజకీయాల్లో టవర్లు మ్యాటర్... ఇసుక కోటలు కాదు' అని రౌత్... శివసేన అధికారిక పత్రిక 'సామ్నా'లో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. అజిత్ పవార్ తన మామ వల్ల రాజకీయంగా ఎదిగారు... ఇప్పుడు ఆయన రాజకీయ జీవితాన్ని ముగించే పనిలో ఉన్నారంటూ సామ్నా ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అయిన రౌత్ విమర్శించారు. 'మోదీకి మద్దతు ఇవ్వడం తిరోగమన శక్తులకు మద్దతు ఇవ్వడం లాంటిదని శరద్ పవార్ భావిస్తున్నారు. ఆయన పార్టీని వీడిన వారి రాజకీయ జీవితం భవిష్యత్తులో ముగిసిపోతుందని నమ్ముతున్నారు. బీజేపీతో చేతులు కలిపే తప్పును పవార్ ఎన్నటికీ చేయరు... సమస్య వ్యక్తులకు సంబంధించినది కాదు. కానీ ప్రజాస్వామ్యం - నియంతృత్వం మధ్య' అని రౌత్ పేర్కొన్నారు. వ్యవసాయం, సహకార , విద్యా రంగాలలో అనేక సంస్థలకు నాయకత్వం వహిస్తున్న శరద్ పవార్... తన మేనల్లుడికి అనేక బాధ్యతలు అప్పగించినందున ఆగస్టు 5న అజిత్ పవార్‌తో జరిగిన సమావేశం... రాజకీయంగా జరిగి ఉండకపోవచ్చని రౌత్ అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం... సదరు సంస్థల భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ఉందన్నారు. అజిత్ పవార్‌ను రౌత్... 'వడ్రంగి పక్షి'తో పోల్చారు. అతను ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుర్చీకి రంధ్రాలు చేస్తే... డిప్యూటీ సీఎం, బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ ఆ పక్షికి బలాన్ని ఇవ్వడం ఖాయమని పేర్కొన్నారు.

రాజీవ్ 'డిజిటల్ ఇండియా' శిల్పి: ఖర్గే

వీర్ భూమి వద్ద కాంగ్రెస్ నేతల ఘన నివాళి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఆదివారం మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించింది. రాజీవ్ గాంధీ 21వ శతాబ్దపు భారతదేశ నిర్మాణంలో అపూర్వ కృషిచేశారని పేర్కొంది. రాజీవ్ గాంధీకి నివాళులు అర్పిస్తూ... కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే... ఆయనను డిజిటల్ ఇండియా శిల్పిగా అభివర్ణించారు. ప్రధానమంత్రిగా అద్భుతమైన పనితీరుతో రాజీవ్... ప్రపంచ అగ్ర నాయకులలో ఒకరిగా స్థానం పొందారన్నారు. 'మేము నిజమైన దేశభక్తుడికి సెల్యూట్ చేస్తున్నాం' అన్నారు. ఆయన దేశంలో తీసుకొచ్చిన టెలికమ్యూనికేషన్, ఐటీ విప్లవం, కంప్యూటరీకరణ కార్యక్రమం భారతదేశాన్ని ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలిపాయని, లక్షలాది మంది యువతకు ఉపాధి లభించిందని తెలిపారు. ఓటు హక్కు వయసును తగ్గించడం, పంచాయతీరాజ్‌ను బలోపేతం చేయడం, నిరంతర శాంతి ఒప్పందాల ద్వారా పొరుగుదేశాలతో సామరస్యాన్ని నెలకొల్పడం వంటి అనేక చర్యలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సాధనంగా మారాయని ఖర్గే పేర్కొన్నారు. 'ఎక్స్'లో హిందీలో రాసిన పోస్ట్‌లో రాహుల్ గాంధీ... తన తండ్రికి నివాళులర్పించారు. 'పాపా, భారతదేశం కోసం మీరు కన్న కలలు పొంగిపొర్లుతున్నాయి. మీ అడుగుజాడలే నా మార్గం - ప్రతి భారతీయుడి పోరాటాలు, కలలను అర్థం చేసుకోవడం, భారతమాత గొంతు వినడం' అని పేర్కొన్నారు. ఢిల్లీలోని రాజీవ్ గాంధీ స్మారకం వీర్ భూమి వద్ద ఖర్గే, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు నివాళులర్పించారు. అనంతరం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లోని రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద ఖర్గే, సోనియా గాంధీతోపాటు ఇతర నేతలు కూడా నివాళులర్పించారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌కు హాజరైన ప్రముఖుల్లో రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్, బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి తదితరులు ఉన్నారు.

లడాఖ్‌లో భారత భూభాగం ఆక్రమణ: రాహుల్

లేహ్: లడాఖ్‌లో భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ విషయంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. లడాఖ్ పర్యటనలో ఉన్న రాహుల్ ... ఆదివారం మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. లడాఖ్‌లో భూభాగాన్ని చైనా ఆక్రమించినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ఒక్క అంగుళం భూమి కూడా చైనా పరం కాలేదని చెబుతున్నారని, ఇది అవాస్తవమని రాహుల్ అన్నారు.చైనా సైన్యం ఈ ప్రాంతంలోకి వచ్చి కొంత భూమిని స్వాధీనంలోకి తీసుకుందని ఇక్కడి ప్రజలు చెబుతున్నారని రాహుల్ పేర్కొన్నారు. 'లడాఖ్ ప్రజలు అనేక అంశాలపై ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పుడు వారికి ఇచ్చిన హోదా (కేంద్ర పాలితప్రాంతం)తో సంతృప్తిగా లేరు. తమకు ప్రాతినిధ్యం కావాలని కోరుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య కూడా ఉంది. తమ రాష్ట్రాన్ని బ్యూరోక్రాట్లు కాకుండా... ప్రజాప్రతినిధులు పాలించాలని కోరుకుంటున్నారు. చైనా... తమ భూభాగాన్ని తీసేసుకుందన్న ఆందోళన కూడా ఇక్కడ ఉంది. తమ ప్రాంతంలోకి చైనా సైన్యం చొరబడిందని ప్రజలు చెబుతున్నారు. పశువులను మేతకు తీసుకెళ్లే ప్రాంతాలను వారు లాగేసుకున్నారని చెప్పారు. కానీ, ప్రధాని మాత్రం... ఒక్క అంగుళం కూడా ఎవరూ తీసుకోలేదని చెబుతున్నారు. అది నిజం కాదు. ఇక్కడ మీరు ఎవరినైనా అడగండి" అని రాహుల్ స్పష్టం చేశారు.

లడాఖ్ ప్రజలు ఏ మాత్రం సంతోషంగా లేరని రాహుల్ గాంధీ చెప్పారు. తన తండ్రి రాజీవ్ గాంధీకి లడాఖ్ చాలా ఇష్టమైన ప్రాంతంగా ఆయన గుర్తు చేసుకున్నారు. భారత్ జోడో యాత్రలో తాను లడాఖ్ వచ్చినట్లు చెప్పారు. అయితే ఆంక్షల కారణంగా ఎక్కువ సేపు లడాఖ్‌లో గడపలేకపోయానని రాహుల వివరించారు. లడాఖ్‌లోని భారత భూభాగంలోకి చైనా చొచ్చుకు వచ్చిందని ఆయన ఆరోపించారు. గత మూడేళ్లుగా తూర్పు లడ్దాఖ్ ప్రాంతంలో భారత్- చైనా మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. 2020 జూన్ లో గాల్వాన్ లోయలో రెండు దేశాల సైన్యం మధ్య ఘర్షణ జరిగింది. లడాఖ్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శనివారం బైక్ పై పాంగోంగ్ సరస్సు వరకు వెళ్లారు.

చాటు మాటు పోరాటం ఎందుకు?

రఘురామ్ రాజన్‌కు అశ్వినీ వైష్ణవ్ ప్రశ్న

బెంగళూరు: భారతీయ రిజర్వు బ్యాంకు(ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌పై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ విరుచుకుపడ్డారు. మంచి ఆర్థికవేత్తలు రాజకీయ నాయకులుగా మారితే ఆర్థిక స్పృహ కోల్పోతారని వ్యాఖ్యానించారు. రాజన్ ఎవరి తరఫునో ఉంటూ చాటుగా పోరాటం చేస్తున్నారని విమర్శించారు. భారతదేశం ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం కింద మొబైల్ ఫోన్‌లను తయారు చేయడం లేదని, కేవలం విడిభాగాలను దిగుమతి చేసుకుని మొబైల్స్‌ను తయారు చేస్తోందని రాజన్ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి స్పందిస్తూ ఆర్థికవేత్త రాజకీయనాయకుడిగా మారితే...ఆర్థిక స్పృహ కోల్పోతారని, రఘురామ్ రాజన్ ప్రస్తుతం రాజకీయ నాయకుడిగా మారారని ఆరోపించారు. ఆయన ఎన్నికలు పోటీ చేయాలని, రాజకీయ కార్యకలాపాల్లో భాగస్వామి కావాలని, చాటుగా ఉంటూ పోరాటం చేయటం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. రఘురామ్ రాజన్ మంచి ఆర్థిక వేత్త... ఉంటే ఆర్థికవేత్తగానైనా ఉండాలి లేదా రాజకీయ నాయకుడిగా మారిపోవాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. రానున్న రెండేళ్లలో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో 30 శాతం మెరుగైన పురోగతితో ముందుకు సాగుతామని అశ్వినీ వైష్ణవ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం వీటిని ప్రపంచవ్యాప్తంగా సరఫరా చేయటం కష్టంగా ఉందన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీని ప్రారంభించాలనుకొనే ప్రతి దేశం మొదటగా నాక్డ్-డౌన్ విడిభాగాలు, సెమీ నాక్డ్-డౌన్ ఉత్పత్తిని సమీకరించే మార్గాన్ని అనుసరించాలని సూచించారు.

ఉల్లి అమ్మకాల నిలిపివేత

40 శాతం ఎగుమతి సుంకంపై మహారాష్ట్ర రైతుల ఆందోళన

ముంబై: ఎగుమతులపై కేంద్రం 40 శాతం సుంకం విధించడాన్ని నిరసిస్తూ మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో రైతులు ఉల్లి వేలాన్ని నిలిపివేశారు. ధరలు పెరుగుతున్న సంకేతాల మధ్య దేశీయ లభ్యతను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం శనివారం ఈ ఏడాది డిసెంబరు 31 వరకు ఉల్లిపాయల ఎగుమతిపై 40 శాతం సుంకాన్ని విధించింది. దీంతో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ అహ్మద్‌నగర్ జిల్లా రాహురి తహసీల్‌లో ఉల్లి రైతులు హోల్‌సేల్ మార్కెట్‌లో కొనసాగుతున్న బల్బు వేలాన్ని నిలిపివేశారు. 'కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరి మళ్లీ తెరపైకి వచ్చింది. మహారాష్ట్రలోని రైతులు ఉల్లి ఎగుమతుల నుంచి మంచి రాబడిని ఆశించారు. అయితే విధించిన సుంకం ఎటువంటి ఎగుమతి ఉండదని నిర్ధారిస్తుంది. దేశీయ మార్కెట్‌లో ధరలు పతనమై రైతులు నష్టపోతారు' అని స్వాభిమాని షెట్కారీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సందీప్ జగ్తాప్ అన్నారు. మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల్లో తగినంత వర్షాలు కురువకపోవడంతో మార్కెట్‌లోకి తాజా ఉల్లి రాక ఆలస్యం అవుతుందని, ప్రభుత్వం వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షిస్తోందని, రైతులను విస్మరిస్తోందని ఆరోపించారు. 'కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి రాష్ట్రవ్యాప్తంగా హోల్‌సేల్ మార్కెట్లలో నిరసనలు నిర్వహిస్తున్నాము' అని జగ్తాప్ చెప్పారు.

హోల్‌సేల్ మార్కెట్‌లో ఉల్లిపాయల వేలాన్ని అహ్మద్‌నగర్ జిల్లా రాహురి తహసీల్‌లో రైతుల బృందం నిలిపివేసింది. 'కేంద్రం మా కష్టాలపై కూడా దృష్టి పెట్టాలి. ఎందుకంటే ఎగుమతి సుంకం వ్యాపారులకు ఒక సందేశాన్ని పంపింది. అందుబాటులో ఉన్న ఉల్లిని దేశీయ మార్కెట్‌లలో మాత్రమే విక్రయించబోతున్నాం. వ్యాపారులు ఇప్పుడు మా ఉత్పత్తులకు తక్కువ ధరలను చెప్పడం ప్రారంభించారు' అని రాహురిలో నిరసన తెలిపిన ఒక రైతు అన్నారు. ఆసియాలోనే అతిపెద్ద హోల్‌సేల్ ఉల్లిపాయల మార్కెట్ అయిన లాసల్‌గావ్ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ వర్గాల సమాచారం ప్రకారం, గత వారం ఉల్లి ధరలో దాదాపు 45 శాతం పెరుగుదల ఉంది. 'రెండు వారాల క్రితం ఉల్లి క్వింటాల్‌కు రూ.1,500 కు విక్రయించారు. అది కేవలం ఒక వారంలోనే రూ.2,200 కు పెరిగింది. ఇప్పుడు ఎగుమతులు దాదాపు అసాధ్యంగా మారినందున రేట్లు తగ్గడం ప్రారంభమైంది' అని లాసల్‌గావ్ ఏపీఎంసీ నుంచి ఒక వ్యాపారి చెప్పారు.

పేదలకు మోదీ చేసిందేమీ లేదు

- గిరిజనులకు రాష్ట్రప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- చింతపల్లిలో కదంతొక్కిన ఎర్రదండు

విశాలాంధ్ర-చింతపల్లి: తొమ్మిదేళ్ల నరేంద్ర మోదీ పాలనలో పేద ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదని, అంబానీ, అదానీలు ప్రపంచంలోనే అత్యంత ధనిక వ్యక్తులుగా ఎదిగారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. మాయమాటలతో ప్రజల్ని నమ్మించి అధికారంలోకి వచ్చి... కులం, మతం పేరుతో చిచ్చుపెడుతున్నారన్నారు. హిందువులకు అన్యాయం జరుగుతోందంటూ గగ్గోలు పెట్టే బీజేపీ... హిందువులకు ఏ ఊరిలో ఏ ప్రమాదం వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. మైనార్టీలను అభద్రతాభావానికి గురిచేసి మెజార్టీ హిందువుల ఓట్లతో మరల అధికారంలోకి రావాలని మత ప్రాతిపదిక పైన విభజన చేస్తున్నారని విమర్శించారు. రామకృష్ణ నేతృత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ 'రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి' నినాదంతో సీపీఐ ఈ నెల 17న విశాఖలో ప్రారంభించిన బస్సుయాత్ర ఆదివారం అల్లూరి జిల్లా చింతపల్లి చేరుకుంది. ముందుగా స్థానిక హనుమాన్ కూడలి వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చిన పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ, నియంతృత్వ విధానాలకు పెద్ద పెట్టున కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం సీపీఐ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిగ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో పేదవాడు బాగుపడింది లేదన్నారు. చిన్న వ్యాపారులు లబ్ధి పొందలేదని, రైతుల ఆదాయం మెరుగుపడలేదని చెప్పారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ అండతో అంబానీలు, అదానీలు దండిగా సంపాదించుకుని, ప్రపంచంలోనే అత్యంత ధనికులుగా ఎదిగారని తెలిపారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, జగన్‌లు కుమ్మక్కై అదానికి సేవ చేస్తున్నారన్నారు. కృష్ణపట్నం, గంగవరం పోర్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ తదితర ప్రభుత్వ సంస్థలను దోచిపెడుతున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉంది కాబట్టే 1100 మంది అక్కడ పనిచేస్తున్నారని, అదే ప్రైవేటుపరం అయితే దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల వారికి అక్కడ రిజర్వేషన్లు ఉండవని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం 900 రోజులుగా పోరాటం చేస్తున్న కూర్మన్నపాలెం వద్ద నుంచే విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో పాటు రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదాలను ముందుకు తీసుకు వెళ్లేందుకు బస్సు యాత్రను ప్రారంభించామన్నారు. ప్రతి చోటా ప్రజా సమస్యల్ని తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీలు చూడడం జరిగిందని, గిరిజన ప్రాంతంలో అటువంటి వాటి జాడేలేదన్నారు. సెంటు జాగాలో ఇల్లు ఇచ్చే పాలకులకు మాత్రం ఎకరం జాగాలో ఇల్లు ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో పది లక్షల రూపాయలతో ప్రతి ఒక్కరికి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నూతన విద్యా విధానానికి తెరలేపి, పాఠశాలలను మూసివేస్తూ విద్యా విధానాన్ని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రజానీకానికి ఉపయోగపడే రహదారుల కల్పనలో మీనమేషాలు లెక్కించే ప్రభుత్వాలు... మన్యం ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న ఖనిజ సంపదను దోచుకుపోయేందుకు మాత్రం విస్తారమైన రహదారులు వేగవంతంగా నిర్మించుకుంటున్నారని చెప్పారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత ప్రజలను నిర్వాసితులను చేసేందుకు ప్రభుత్వాలు ప్రయత్నించడం దుర్మార్గమైన చర్య అన్నారు. గిరిజన చట్టాలను నిర్వీర్యం చేస్తూ వారి హక్కులను ఈ ప్రభుత్వాలు కాల రాస్తున్నాయన్నారు. సమస్యలన్నింటిపై ప్రజల వద్దకు వెళ్లి వివరించడమే గాక వారిని చైతన్యపరుస్తున్నామని రామకృష్ణ చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటానికి ప్రతి ఒక్కరూ తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఎం కార్యవర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్, కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు తదితరులు ప్రసంగించారు. రాష్ట్ర మహిళా సమాఖ్య నాయకురాలు అత్తిలి విమల, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు చంద్రనాయక్, ఏఐవైఎఫ్ నాయకుడు రాజేంద్ర, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు దీసరి బీమలమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి, సింహాచలం, సేగ్గే కొండలరావు, అంజలి, శనివారం సర్పంచ్ పేట్ల రాజబాబు, ఎర్ర బొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు, చింతపల్లి జీకే వీధి మండల కార్యదర్శులు పేట్ల పోతురాజు, కంకిపాటి సత్తిబాబు, మేక సత్యనారాయణ, మఠం సూరి పడాల్ , అమర్, జల్లి రాజబాబు, కే రాధాకృష్ణ, సతీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర నేటి షెడ్యూల్

కాకినాడలో కోస్టల్ కారిడార్, ప్రత్యేక హోదాపై రౌండ్ టేబుల్ సమావేశం

సాయంత్రం రాజమండ్రిలో ప్రదర్శన, బహిరంగ సభ

బ్రిటిష్ వారియర్స్ పేరుతో మెమోరియల్ పార్క్ నిర్మించాలి

- సమాధుల స్థలాన్ని ఆక్రమించడం అన్యాయం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి (నర్సీపట్నం): అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో బ్రిటిష్ వారియర్స్ సమాధులు ఉన్న స్థలాన్ని ఆక్రమించుకొని, పక్కా నిర్మాణాలు చేపట్టడం దురదృష్టకరం, అన్యాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. సీపీఐ బస్సు యాత్రలో భాగంగా ఆదివారం ఆయన పట్టణంలో ఉన్న బ్రిటిష్ వారియర్స్ (పూర్వం అల్లూరి సీతారామరాజుపై పోరాడి అసువులు బాసిన వారు) సమాధుల ప్రాంతాన్ని పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్రిటిష్ వారియర్స్ సమాధుల కోసం ఏనాడో ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ నోటిఫికేషన్ సైతం జారీ చేసిందని గుర్తు చేశారు. 46 సెంట్లు ఉన్న స్థలం ఆక్రమణకు గురై ప్రస్తుతం సుమారు 20 సెంట్లు మాత్రమే ఉందని, ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని మెమోరియల్ పార్కుగా రూపొందించాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం, నర్సీపట్నం ఇలా అన్నిచోట్ల ప్రభుత్వ భూములను కబ్జాకు గురవుతున్నాయన్నారు. ఈ ఆక్రమణలపై జిల్లా సీపీఐ నాయకులు బాలేపల్లి వెంకటరమణ, జి.గురుబాబు... అనేకమార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. హైకోర్టులో కేసు ఉండగా దాన్ని అడ్డుకుంటోంది ఎవరు అనే విషయంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భూ కబ్జాలకు పాల్పడుతున్న వారికి ప్రజాప్రతినిధులు, అధికారులు కొమ్ము కాయడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి చారిత్రక ప్రదేశాలను ఆక్రమించుకోవడం ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని మెమోరియల్ పార్కుగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌కు లేఖ రాస్తానని రామకృష్ణ తెలిపారు.

మాకిరెడ్డి దేముడిబాబుకు నివాళి

ఇటీవల మరణించిన సీపీఐ సీనియర్ నేత మాకిరెడ్డి దేముడు బాబుకు రామకృష్ణ నివాళులర్పించారు. నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామంలో ఆయన నివాసానికి వెళ్లి... కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కామ్రేడ్ మాకిరెడ్డి స్థూపం వద్ద అంజలి ఘటించారు. మాకిరెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శులు మాకిరెడ్డి రాము నాయుడు, రాజాన దొరబాబు, నర్సీపట్నం పట్టణ కార్యదర్శి జి.గురు బాబు, రూరల్ కార్యదర్శి ఎస్.శ్రీరామ్ మూర్తి తదితరులు ఉన్నారు.

అల్లూరి స్ఫూర్తితో

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

విశాలాంధ్ర-గొలుగొండ: 'రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో చేపట్టిన బస్సు యాత్రలో భాగంగా అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో అల్లూరి స్మారకమందిరాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, ఇతర సీపీఐ నేతలు సందర్శించారు. అల్లూరికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... అల్లూరి స్ఫూర్తితో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని తెలిపారు. యాత్ర ముగింపు సందర్భంగా తిరుపతిలో సెప్టెంబరు 8న భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించి... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలియజేశారు. ముందుగా గ్రామంలో అంబేద్కర్ కూడలి నుంచి అల్లూరి స్మారక మందిరం వరకు భారీగా ప్రజానాట్యమండలి సభ్యులు, నాయకులతో ర్యాలీ నిర్వహించి సమాధులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అత్తిలి విమల, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, రాష్ట్ర అధ్యక్షులు శంకర్ నాయక్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శిలు మాకిరెడ్డి రామానాయుడు, రాజాన దొరబాబు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లగుడు వెంకటరమణ, నర్సీపట్నం కార్యదర్శి గురు బాబు, గొలుగొండ కార్యదర్శి మేక భాస్కరరావు, రైతు సంఘం నాయకులు మేక సత్యనారాయణ. రావణ పిల్లి ఎంపీటీసీ ఇరవాడ సత్యవేణి, కొయ్యూరు కార్యదర్శి ఇరవాడ దేవుడు, సీనియర్ నాయకులు రుత్తాల బుజ్జి, ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు, ప్రజానాట్యమండలి కళాకారులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆ జర్నలిస్టులకు న్యాయం చేయాలి

అసోం సీఎంకు ఐజేయూ డిమాండ్

హైదరాబాద్: అసోంలోని గువహటిలోగల శాటిలైట్ ఛానల్ డీఏ న్యూస్ ఫ్లస్‌ను ఆకస్మికంగా మూసివేయడంపై ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ఆందోళన వ్యక్తం చేసింది. ఆ ఛానల్ పాత్రికేయులు, ఇతర సిబ్బందికి తగిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంలో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ జోక్యం చేసుకొని జర్నలిస్టులతో పాటు ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని ఆదివారం ఓ ప్రకటనలో ఐజేయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, బల్విందర్ సింగ్ జమ్ము కోరారు. వార్తా ఛానల్‌ను మూసివేసే ముందుకు ఉద్యోగులకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని తెలిపారు. 'ఈనెల 17న ఏకేడీ బిల్డ్ ఇండియా ప్రై.లి. సీఎండీ సంతకంతో ఉన్న నోటీసు వారి దృష్టికి వచ్చింది. మరుసటి రోజు నుంచి ఛానల్ ప్రసారాలు, ఇతర కార్యకలాపాలు నిలిచిపోతున్నట్లు అందులో ఉంది. ఒక రోజు ముందు నోటీసు ఇచ్చి వార్తాఛానల్‌ను మూసివేయడం దారుణం' అని పేర్కొన్నారు.

వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర రచయితలు

సంఘటితం కావాలి

- అరసం జాతీయ అధ్యక్షుడు పొన్నీలన్ సందేశం
- ఉత్సాహంగా జాతీయ మహాసభలు ప్రారంభం
- జబల్పూర్ నగరవీధుల్లో భారీ ప్రదర్శన

(జబల్పూర్ నుండి వేల్పుల నారాయణ, మోతుకూరి అరుణకుమార్)

దేశంలో మతోన్మాద, నియంతృత్వ శక్తులు పేట్రేగిపోతున్న ప్రస్తుత సంక్షోభ సమయంలో వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర రచయితలు సంఘటితం కావాలని అరసం జాతీయ అధ్యక్షుడు పొన్నీలన్ రచయితలకు దిశానిర్దేశం చేశారు. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఆదివారం ప్రారంభమైన ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ (అరసం)18వ జాతీయ మహాసభలకు అరసం జాతీయ నాయకులు పెనుగొండ లక్ష్మి నారాయణ, పూనమ్ సింగ్, అమితవ చక్రవర్తి, నరేశ్ సక్సేనా, నతమాల్ శర్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. అనారోగ్య కారణాల వల్ల పొన్నీలన్ హాజరు కాలేకపోయినప్పటికీ... ఆయన పంపిన సందేశంలో అనేక రాజకీయ, సాంస్కృతిక అంశాలపై రచయితల బాధ్యతలను వివరించారు. దేశంలో హిందూత్వశక్తులు త్వరితగతిన విస్తరిస్తున్నాయని, వాటిని ప్రతిఘటించేందుకు రచయితలకు సామాజిక పరమైన కులం, సాంస్కృతిక అడ్డంకులు ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో రచయితలు వాటికతీతంగా ప్రజల్ని చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. పెట్టుబడిదారీ విధానం తీవ్రవాదానికి తండ్రిలాంటిదని, అమెరికన్ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం తీవ్రవాదానికి ప్రేరణ అవుతుందని, అలాంటి అమెరికన్ సామ్రాజ్యవాదులతో భారత ప్రభుత్వం స్నేహం చేస్తూ దేశంలో తన రహస్య ప్రాబల్యాన్ని పెంచుకుంటుందని, అలాంటి వాళ్లే తీవ్రవాదాన్ని విమర్శిస్తున్నారని ఎండగట్టారు. అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖ్‌దేవ్ సింగ్ సిర్సా మాట్లాడుతూ రచయితలు రాయడమే కాక ఉద్యమాల్లో, ఆందోళనల్లో పాలుపంచుకోవాలని సూచించారు. ఇప్పుడు దేశంలో ప్రజల కోసం ఆలోచించేవారిపైనా, రాసేవారిపైనా ఒత్తిడి, అణచివేత పెరిగిపోయిందని, అయినా ఇలాంటి పరిస్థితుల్లో రచయితలు ఉద్యమాల్లో పాలుపంచుకుంటున్నారని చెప్పారు. దిల్లీలో జరిగిన మహత్తర రైతు ఉద్యమంలో అరసం రచయితలు భాగస్వాములయ్యారని, ఇతర రాష్ట్రాలలోనూ అనేక ఆందోళనల్లో రచయితలు పాల్గొన్న సందర్భాలు ఉన్నాయని, రచయితలపై ఒత్తిడి పెరిగినా నిలదొక్కుకుంటున్నారని ఆయన అభినందించారు. కాగా, గత మహాసభల నుండి ఇప్పటి వరకు అరసం నిర్వహించిన అనేక సాహితీ కార్యక్రమాలను, నిర్మాణ పరిస్థితులను ఆయన నివేదించారు. సభలో మొదట జాతీయ కార్యదర్శి వినీత్ తివారీ గత మహాసభల నుండి ఇప్పటివరకు మరణించిన అనేకమంది రచయితలు, కళాకారులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. అరసం మరో జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ రెండు తెలుగు రాష్ట్రాల అరసం కార్యక్రమాలను వివరించారు. వేదికపై జాతీయ నాయకులు రాజేంద్ర రాజన్, విభూతి నారాయణ, రాజేంద్ర శర్మ, దేవారాం త్రిపాఠి, అమితాబ్ చక్రవర్తి, నక్మల్ శర్మ, రాజ్ మందారా, కుందన్ సింగ్, అనురాగ్ తదితరులు వేదికనలంకరించారు. మహాసభలకు ముందు అరసం జెండాను సంఘం పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర రాజన్ ఆవిష్కరించారు. పెనుగొండ లక్ష్మీనారాయణ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ మహాసభలు మూడురోజుల పాటు కొనసాగుతాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల నుండి...

రెండు తెలుగు రాష్ట్రాల నుండి 24 మంది ప్రతినిధులు మహాసభలకు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పెనుగొండ లక్ష్మీనారాయణ, వల్లూరి శివప్రసాద్, జి.ఓబులేసు, చెరుకుమల్లి సింగ, ఉప్పల అప్పలరాజు, ఎస్.వెంకట సుబ్బయ్య, ఎస్. ఈశ్వర్‌రెడ్డి, డా.టి.సురేశ్‌బాబు, డా.ఎస్.రాజగోపాల్‌రెడ్డి, ఏఎంఆర్. ఆనంద్, ఎం.అరుణకుమార్, శిఖా ఆకాశ్, గూటం స్వామి, బంగారు వీబీ ఆచార్యులు, బీఎస్ సాగర్ హాజరయ్యారు. తెలంగాణ నుంచి వేల్పుల నారాయణ, డా.రాపోలు సుదర్శన్, డా. పల్లేరు వీరాస్వామి, నిధి, కన్నం లక్ష్మీనారాయణ, ఏలేశ్వరం వెంకటేశ్, వై.లెనిన్, శ్రీదాస్యం లక్ష్మయ్య తదితరులు హాజరయ్యారు.

సాయంత్రం జబల్పూర్ నగర వీధుల్లో ప్రజాసాహిత్యం వర్ధిల్లాలని నినదిస్తూ రచయితలు భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రజా నాట్యమండలి కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.